రైవాడ ఆయకట్టుకు 29 నుంచి నీరు విడుదల

» ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పాత్రునాయుడు వెల్లడి
-చార్ల 8వ పేజీలో

అడ్మిషన్లు అంతంతే...

ప్రభుత్వ పాఠశాలల్లో అనుకున్న స్థాయిలో పెరగని ప్రవేశాలు

- 61 ప్రాథమిక పాఠశాలల్లో పది మందికన్నా తక్కువ విద్యార్థులు
- అదనంగా ఉన్న ఉపాధ్యాయులు ఇతర స్కూళ్లకు సర్దుబాటు
- ఈ నెలాఖరు వరకు కొనసాగనున్న స్పెషల్ డ్రైవ్


ఆరుగురు విద్యార్థులు మాత్రమే వున్న ఎలమంచిలి మండలం లైన్‌కొత్తూరు ప్రాథమిక పాఠశాల

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగినప్పటికీ.. పలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు అరకొరగానే వున్నారు. జిల్లాలో 61 పాఠశాలల్లో పది మంది, అంతకన్నా తక్కువ విద్యార్థులు వున్నట్టు జిల్లా విద్యా శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి మేరకు అదనంగా వున్న టీచర్లను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నూతన విద్యా విధానం అమలు పేరుతో గత వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసింది. దీంతో పలు ప్రాథమిక పాఠశాలలు ఒకటి, రెండు తరగతులకే పరిమితం అయ్యాయి. మూడు నుంచి ఐదో తరగతి వరకు సమీపంలోని ఉన్నత పాఠశాలలకు తరలించడంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను అంతదూరం పంపించడం ఇష్టం లేక ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. దీంతో ప్రాథమిక పాఠశాలలు అరకొర విద్యార్థులతో వెలవెలపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడానికి పలు చర్యలు చేపట్టారు. చాలా కాలం నుంచి అమలులో వున్న ఉచిత మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫారంతో పాటు తల్లికి వందనం పథకాన్ని ప్రతి విద్యార్థికీ అమలు చేస్తున్నది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశాలు ఆశాజ నంగానే వున్నాయి. అయితే పలు ప్రాథమిక పాఠశాలల్లో కనీస స్థాయి లో విద్యార్థులు లేని పరిస్థితి నెలకొం ది. ఇటువంటిచోట్ల అదనంగా వున్న ఉపాధ్యాయులకు విద్యా శాఖ అధికారులు ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేస్తున్నారు.


అనకాపల్లి మండలం గోపాలపురంలో ఏడుగురు విద్యార్థులు మాత్రమే వుండడంతో నిరుపయోగంగా వున్న భవనం

అనకాపల్లి మండలం గోపాలపురం ప్రాథమిక పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. దీంతో నాడు-నేడు కార్యక్రమం కింద గతంలో నిర్మించిన అదనపు భవనాలు ఖాళీగా వున్నాయి. ఎలమంచిలి మండలం లైన్ కొత్తూరు ఎంపీపీ పాఠశాలలో కూడా ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ రెండు పాఠశాలలు కాదు.. జిల్లాలో పది మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలు 61 ఉన్నట్టు జిల్లా విద్యా శాఖాధికారులు గుర్తించి, ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిసింది. జిల్లాలోని పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గడం వాస్తవమేనని, అయితే కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తున్నట్టు జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇది సత్ఫలితాలు ఇస్తుండడంతో ఈ నెలాఖరు వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మహా నిరాశ

దిగజారిన జీవీఎంసీ ర్యాంకు

- పది లక్షల జనాభా పైబడిన నగరాల కేటగిరీలో తొమ్మిదో ర్యాంకు
- గత రెండేళ్లు నాలుగో ర్యాంకు
- డోర్ టు డోర్ చెత్తసేకరణలో వెనుకబాటు
- ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో తగ్గిన మార్కులు
- గార్బేజ్ ఫ్రీ సిటీ (జీఎఫ్‌సీ)లో ఫైవ్ స్టార్ సర్టిఫికెట్‌కు పరిమితం

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి):



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్-2024 పోటీలో జీవీఎంసీ చతికిలపడింది. పది లక్షలకు పైబడిన జనాభా కలిగిన నగరాల కేటగిరీలో గడచిన రెండేళ్లు నాలుగో ర్యాంకును దక్కించుకున్న జీవీఎంసీ గురువారం వెల్లడైన ఫలితాల్లో తొమ్మిదో ర్యాంకుకు దిగజారిపోయింది. ఆరు నెలల పాటు జీవీఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ, డంపింగ్ యార్డుల్లో చెత్త రీసైక్లింగ్, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ విషయాల్లో ఆశించిన ఫలితాలను సాధించలేకపోవడమే కారణమనే ... మిగతా 8వ పేజీలో

'సఫాయిమిత్ర సురక్షిత్' కేటగిరీలో జీవీఎంసీ టాప్

స్వచ్ఛ సర్వేక్షణ్-2024 ర్యాంకులు విడుదల

- ఢిల్లీలో కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న మేయర్, కమిషనర్

- 8లో

కొండలు కొల్లగొడుతున్నారు

అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు

- గుర్రంపాలెం, పెదముషిడివాడ, ఉడేరుల్లో యంత్రాలు స్వాధీనం చేసుకున్న గనుల శాఖ అధికారులు
- విజిలెన్స్ అధికారులకు నేతల ఫోన్
- అక్రమ క్వారీయింగ్‌పై ఉన్నతాధికారులకు నివేదిక


అనకాపల్లి మండలం వేటజంగాలపాలెంలో రాత్రిపూట గ్రావెల్ అక్రమ తవ్వకాలు

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్, రాయి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. సుమారు వందచోట్ల అక్రమంగా క్వారీయింగ్ జరుగుతున్నది. ఈ విషయమై గనుల శాఖ విజిలెన్స్ విభాగం ఉన్నతాధికారులకు నివేదించినట్టు తెలిసింది.

గనుల శాఖ రెగ్యులర్, విజిలెన్స్ విభాగాల అధికారులు వేర్వేరుగా పగటిపూట దాడులు చేస్తున్నారు. అక్రమ క్వారీయింగ్ చేస్తున్న యంత్రాలను సీజ్ చేస్తున్నారు. అయితే మాఫియా మాత్రం పగటిపూట కంటే రాత్రి సమయాల్లోనే ఎక్కువగా క్వారీయింగ్ చేస్తోంది. గనుల శాఖలో పరిమితంగా ఉన్న సిబ్బంది రాత్రిపూట దాడులు చేయడం లేదు. ఒకవేళ ఒకరు, ఇద్దరు తనిఖీలకు వెళితే మాఫియా ఎదురు దాడులకు పాల్పడే అవకాశం ఉంది. దీనికితోడు అనేకచోట్ల అక్రమంగా చేపడుతున్న క్వారీయింగ్‌ను అరికట్టేంత యంత్రాంగం గనుల శాఖకు లేదు. దీంతో అధికార పార్టీ నాయకుల పేరు చెబుతూ క్వారీ మాఫియా కొండలను కొల్లగొడుతోంది. కొత్తగా క్వారీయింగ్‌కు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు ఉండాలి. అంత సులువుగా అనుమతులు రావడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో కొంతమంది ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే కొండలను తవ్వేస్తున్నారు. స్థానికంగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే గనుల శాఖ దాడులు చేస్తోంది. ఒకేరోజు ఎక్కువ ఫిర్యాదులు వస్తే ఒకటి లేదా రెండుచోట్ల మాత్రమే దాడులు చేయగలుగుతోంది.

అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల నుంచి ప్రతిరోజు రాత్రి రాంబిల్లిలో నిర్మాణంలో ఉన్న నేవల్ ప్రాజెక్టుకు 100 లారీల బండరాళ్లు వెళుతున్నాయి. గడచిన వారం, పది రోజుల్లో పెందుర్తి మండలం గుర్రంపాలెం, నరవల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న యంత్రాలను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. ఆనందపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం కేటాయించిన కొండను చదునుచేసే కాంట్రాక్టర్ ఎటువంటి అనుమతి తీసుకోలేదు. అక్కడ మట్టి, గ్రావెల్‌ను తవ్వుతున్న మిషనరీని, లంకెలపాలెం సమీపాన పెదముషిడివాడలో సెంటు భూమి ఇళ్ల కోసం వేసిన లేఅవుట్ పక్కనే గ్రావెల్ తవ్వుతున్న యంత్రాలను పట్టుకున్నారు. గురువారం అనకాపల్లి సమీపాన ఊడేరులో రాళ్ల క్వారీలో యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే గనుల శాఖ విజిలెన్స్, రెగ్యులర్ సిబ్బంది దాడులు చేసి యంత్రాలను స్వాధీనం చేసుకున్న వెంటనే కూటమి పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు రంగంలోకి దిగుతున్నారు. కొందరు అయితే బెదిరింపులకు పాల్పడుతున్నారు. నగర శివారుల్లో ఒక అక్రమ క్వారీ వద్ద యంత్రాలు పట్టుకుని పోలీసులకు అప్పగించిన వెంటనే కూటమి నేతలు... గనుల శాఖ విజిలెన్స్ అధికారులకు ఫోన్ చేసి బెదిరించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో అక్రమ క్వారీయింగ్‌పై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్టు తెలిసింది. అక్రమ క్వారీయింగ్‌ను అడ్డుకట్ట వేసేందుకు కీలక ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేస్తే మంచిదని విజిలెన్స్ విభాగం అధికారి ఒకరు పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు

రాష్ట్రస్థాయిలో 30వ స్థానంలో నిలిచిన నర్సీపట్నం మునిసిపాలిటీ

- సామాజిక మరుగుదొడ్ల వినియోగంతో ఓడీఎఫ్ ప్లస్ సాధన


ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరిస్తున్న సిబ్బంది

నర్సీపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి):

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలోనర్సీపట్నం మునిసిపాలిటీ రాష్ట్రస్థాయిలో 30వ ర్యాంకుతోపాటు ఓడీఎఫ్ ప్లస్ సాధించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఐవీఆర్ఎస్ ద్వారా 1,200 మంది నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఇంటింటి చెత్త సేకరణలో 44 శాతం, తడి, పొడి చెత్త విభజనలో 34 శాతం, చెత్త తరలింపు 98 శాతం, వార్డుల్లో బహిరంగంగా చెత్త పోగులు పెట్టడం జీరో శాతం, మార్కెట్లు, ఆవాస ప్రాంతాల్లో పరిశుభ్రతపై 100 శాతం, తాగునీటి సరఫరాపై 100 శాతం, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ బాగుందని 60 శాతం ప్రజలు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 124 పురపాలక సంఘాలు వుండగా.. వీటిలో నర్సీపట్నం మునిసిపాలిటీ 30వ స్థానంలో నిలిచి, ఓడీఎఫ్ ప్లస్ ... మిగతా 8వ పేజీలో


వినియోగంలోకి వచ్చిన సామాజిక మరుగుదొడ్లు

వాక రోడ్డుపై వైసీపీ యాగీ

అటవీ శాఖ భూమి అంటూ మాజీ ఎమ్మెల్యే గణేశ్ వితండ వాదన

- ఏకంగా జిల్లా కలెక్టర్‌పైనే పోలీసులకు ఫిర్యాదు
- ఇది ముమ్మాటికీ రెవెన్యూ భూమి అని టీడీపీ నేతలు విస్పష్టం
- 1967లోనే అటవీ శాఖ డీనోటిఫై చేసినట్టు వెల్లడి
- మూడేళ్ల క్రితం రెవెన్యూ శాఖకు నివేదిక
- అభివృద్ధిని అడ్డుకోవడానికేనని తీవ్రస్థాయిలో ధ్వజం


రెవెన్యూ శాఖ భూమిలో రోడ్డు నిర్మాణం కోసం తుప్పలు తొలగించి చదును చేసిన దృశ్యం

మాకవరపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి):

'మేం అధికారంలో వున్నప్పుడు అభివృద్ధి చేయలేదు. ఇప్పుడు అధికారంలో వున్న మీరు (కూటమి) కూడా అభివృద్ధి పనులు చేయడానికి వీల్లేదు" అన్నట్టుగా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. మాకవరపాలెం మండలం ఎరకన్నపాలెం నుంచి ఎలమంచిలి వద్ద జాతీయ రహదారి వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న రెండు వరుసల నూతన రహదారిపై (వాక రోడ్డు) ఆ పార్టీ నేతలు నానా యాగీ చేస్తున్నారు. ఎరకన్నపాలెం నుంచి పెదపల్లి వద్ద హైవే వరకు చేపట్టిన మట్టి రోడ్డు పనులను నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే గణేశ్‌తోపాటు పలువురు వైసీపీ నాయకులు గురువారం పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణ పనులను ఏ శాఖ చేపడుతున్నది? ఎంత ఖర్చు అవుతుంది? రిజర్వు ఫారెస్టు భూముల్లో నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టవచ్చా?.. వీటికి కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విచిత్రం ఏమిటంటే.. రోడ్డు నిర్మాణం విషయంలో జిల్లా కలెక్టర్‌పై స్థానికుల పోలీసులకు ఫిర్యాదు చేసి, తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో వాక రోడ్డుకు వచ్చి పరిశీలించారు. రెవెన్యూ శాఖకు చెందిన భూమిలో రోడ్డు వేస్తుంటే ఆయనకు (మాజీ ఎమ్మెల్యే గణేశ్) ఉలికిపాటు ఎందుకు అని టీడీపీకి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడుతోపాటు రైతులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాచపల్లి రెవెన్యూ పరిధిలోని 737 సర్వే నంబరులో 1,500 ఎకరాల ప్రభుత్వ ఉందని, ఈ భూమి గుండా ఎరకన్నపాలెం నుంచి ఎలమంచిలి సమీపంలోని పెదపల్లి వరకు కాలిబాట (వాక రోడ్డు) ఉన్నట్టు 1967లోనే అటవీ శాఖ డీనోటిఫై చేసిందని గుర్తు చేశారు. కాలిబాటకు ఇరువైపులా వున్న 1,500 ఎకరాల భూమి రెవెన్యూ శాఖకు చెందినదిగా 2022వ సంవత్సరంలో అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులకు నివేదిక అందజేశారని చెప్పారు. ప్రస్తుతం ఈ సర్వే నంబరులో వున్న రెవెన్యూ భూమిలో సాగుదారులను గుర్తించేందుకు అధికారులు సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా రెవెన్యూ శాఖ భూమిని, అటవీ శాఖ భూమిగా చెప్పడం సరి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాక రోడ్డు నిర్మాణం చేపట్టి ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయించాలని, తద్వారా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నట్టు వారు చెప్పారు.

చోడవరం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా మాధవి

- జనసేనకు దక్కిన పదవి

చోడవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి):


అల్లం మాధవి

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా జనసేన పార్టీకి చెందిన అల్లం మాధవి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చోడవరం మండలం గోవాడ గ్రామానికి చెందిన మాధవి.. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు భార్య. గతంలో ఎంపీటీసీ సభ్యురాలిగా పనిచేశారు. చోడవరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వడ్డాది పోస్టాఫీస్‌లో నిధులు గోల్‌మాల్

- రూ.8.32 లక్షలు స్వాహా చేసిన బీపీఎం

బుచ్చెయ్యపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది తపాల కార్యాలయంలో రూ.8.32 లక్షలు గోల్ మాల్ అయ్యాయి. ఇక్కడ బీపీఎం (బ్రాంచి పోస్టు మాస్టర్)గా ... మిగతా 8వ పేజీలో

భూమి కాలువకు మహర్దశ

హామీని అమలు చేయడానికి సొంత నిధులు వెచ్చిస్తున్న జనసేన నేత గెడ్డం బుజ్జి

- 'పేట శివారు నుంచి ఉద్దండపురం వరకు కాలువ అభివృద్ధి
- రూ.20 లక్షల వ్యయంతో తుప్పల తొలగింపు, పూడికతీత పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు

పాయకరావుపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి):

ఎన్నో ఏళ్లుగా నిర్వహణ పనులకు, అభివృద్ధికి నోచుకోని భూమి ఆనకట్ట పంట కాలువను జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి సొంత నిధులతో బాగు చేయిస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే భూమి ఆనకట్ట పంట కాలువను అభివృద్ధి చేయిస్తానని గత ఏడాది సాధారణ ఎన్నికల సమయంలో ఆయన ఆయకట్టు రైతులకు హామీ ఇచ్చారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా.. పంట కాలువ అభివృద్ధికి నిధులు మంజూరు కాలేదు. దీంతో ఆయకట్టు రైతులకు ఇచ్చిన హామీ మేరకు సొంత సొమ్ము సుమారు రూ.20 లక్షలతో పాయకరావుపేట శివారు నుంచి నక్కపల్లి మండలం ఉద్దండపురం వరకు సుమారు 13 కిలోమీటర్ల మేర కాలువలో తుప్పలు తొలగించి, పూడిక తీతపనులు చేయిస్తున్నారు.


కాలువ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి

పాయకరావుపేట వద్ద తాండవ నదిపై సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన భూమి మినీ ఆనకట్ట కింద పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో సుమారు ఐదు వేల ఎకరాల ఆయకట్టు వుంది. సాధారణంగా రెండు, మూడేళ్లకు ఒకసారి పంట కాలువలో నిర్వహణ పనులు (తుప్పలు తొలగింపు, పూడికతీత) పనులు చేపట్టాలి. కానీ ఈ కాలువలో ఏళ్ల నిర్వహణ పనులు చేయకపోవడంతో పూడిక పేరుకుపోయి, తుప్పలు పెరిగిపోయాయి. దీంతో కాలువలో నీరు సరిగా ప్రవహించక, ఆయకట్టుకు సకాలంలో నీరు అందడంలేదు. రైతులు పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో మూడేళ్ల క్రితం అప్పటి అనకాపల్లి ఎంపీ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేయడంతో పంట కాలువలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ భూమి ఆనకట్ట నుంచి ... మిగతా 8వ పేజీలో


తుప్పలు, పూడిక తొలగించిన తరువాత కాలువలో ప్రవహిస్తున్న నీరు



రోడ్డుపై ఉన్న మురుగు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్న స్థానికులు

చెరువు కాదు.. రోడ్డే..

ఎలమంచిలిలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

దుర్వాసన వస్తున్నా స్థానికులు రాకపోకలు

నిద్రపోతున్న మునిసిపల్ ప్రజారోగ్య శాఖ

ఎలమంచిలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే కోర్టుపేట ప్రధాన రోడ్డుపై డ్రైనేజీ మురుగు నిలిచిపోయి చెరువును తలపిస్తున్నా ప్రజారోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. దుర్వాసన వస్తున్న డ్రైనేజీ నీటిలో నుంచే ప్రజలు, వ్యాపారులు, స్కూలు, కళాశాల విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. రద్దీగా ఉండే ఈ ప్రధాన రోడ్డు దుస్థితినే పట్టించుకోకపోతే మారుమూల ప్రాంతాల వైపు అసలు చూడరని వారంటున్నారు. ఇదేనా మునిసిపల్ అధికారుల పనితీరు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. డ్రైనేజీ అసంపూర్తిగా ఉండడంతో ప్రతిసారీ ఈ సమస్య ఎదురవుతుందని, ఇళ్ల ముందు మురుగు నీరు నిలిచిపోతుండడంతో బయటకు రాలేని దుస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు మార్గంలో ప్రైవేటు కళాశాల, స్కూలు, పలు వ్యాపార సముదాయాలు ఉండడంతో అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అసలే జ్వరాల సీజన్ కావడంతో మురుగు నీటిలో రాకపోకలు సాగించి అనారోగ్యాల బారిన పడతారేమోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మునిసిపల్ అధికారులు సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సూర్యఘర్ లబ్ధిదారుడికి సోలార్ షాక్!

- రాజానపాలెంలో రిటైర్డ్ ఉద్యోగి ఇంటికి రూ. 40 వేలు విద్యుత్ బిల్లు
- 1912కి ఫిర్యాదు.. ▸ బిల్లు చెల్లించండి.. తర్వాత చూద్దామంటూ ఉచిత సలహా

అచ్యుతాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోండి.. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తోందని ఏపీఈపీడీసీఎల్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాని సోలార్ విద్యుత్ వినియోగించిన తర్వాత ఒక రిటైర్డు ఉద్యోగికి బిల్లు రూపంలో విద్యుత్ షాక్ తగిలింది. జూన్ నెలలో ఏకంగా రూ.40,581 బిల్ వచ్చింది.

మండలంలోని రాజానపాలెంలో విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలనే ఉద్దేశంలో 21 మంది సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్‌ని ఏర్పాటుచేసుకున్నారు. ఇందులో రిటైర్డ్ ఉద్యోగి రాజాన అప్పలనాయుడికి జూన్ నెల బిల్ ఏకంగా రూ.40,581 వచ్చింది. దీంతో ఆయన కళ్లు బైర్లు కమ్మాయి. సోలార్ విద్యుత్ వినియోగించక ముందు రూ.1,500 నుంచి రూ.1,800 వరకు బిల్ వచ్చేదని, కాని సోలార్ వేసిన తర్వాత అత్యధిక బిల్ వచ్చిందన్నారు. దీంతో ఆయన 1912కి ఫిర్యాదు చేశారు. వారు ఒక ఉచిత సలహా ఇచ్చేశారు. ముందుగా బిల్ చెల్లించిన తర్వాత చూద్దాం.. లేకుంటే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని చెప్పేరని అప్పలనాయుడు తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' అచ్యుతాపురం ఏఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. ఇంతవరకు ఈ సమస్య నా దృష్టికి రాలేదన్నారు. శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి సమస్యను తెలుసుకుంటానన్నారు.



అప్పలనాయుడుకి వచ్చిన విద్యుత్ బిల్

రెండు గ్రామాల్లో జడ్‌పీ సీఈవో పర్యటన

మల్లవరం, ఎం.జగన్నాథపురంల్లో పారిశుధ్యం, సంపద కేంద్రాలు, హైస్కూళ్లు పరిశీలన



ఎం.జగన్నాథపురంలో జడ్పీ సీఈవో నారాయణమూర్తికి జ్ఞాపికను అందజేస్తున్న సర్పంచ్

అచ్యుతాపురం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మల్లవరం, ఎం.జగన్నాథపురం గ్రామాల్లో గురువారం జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి పర్యటించారు. ఆయా గ్రామాల్లో పరిస్థితులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. మల్లవరం గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ, బురద నీరు, మురుగు నీటి వ్యవస్థ నిర్వహణపై పలు సూచనలు చేశారు. నూతనంగా నిర్మించిన షిర్డీ సాయి బాబా ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఎం.జగన్నాథపురంలో హైస్కూల్‌ను సందర్శించి తరగతి గదులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, టాయిలెట్స్ నిర్వహణపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మేథ్స్‌పై ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాలకు అవసరమయ్యే తరగతి గదులు, మంచినీటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవోను అధికారులు, ఉపాధ్యాయులు సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారావు, సర్పంచులు పిన్నమరాజు వాసు, కరెడ్ల బుల్లెమ్మ, కరెడ్ల ప్రకాష్, ప్రధానోపాధ్యాయుడు సింహాచలం, కన్నారావు, రాజు, అప్పారావు, అప్పలనాయుడు, చంద్రశేఖర ప్రసాద్, పుష్పవల్లి, ప్రసన్న కుమారి, దినేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల రెన్యువల్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ఎలమంచిలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్‌లుగా 2024-25 విద్యా సంవత్సరం వరకూ పనిచేసిన వారు తమ కాంట్రాక్టును రెన్యువల్ చేసుకొనేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. పి. చంద్రశేఖర్ కోరారు. సబ్బవరం డిగ్రీ కళాశాలలో హిస్టరీ, పొలిటికల్ సైన్స్, చోడవరం కళాశాలలో హిస్టరీ, పొలిటికల్ సైన్స్ వడ్డాది, మాడుగుల కళాశాలల్లో హిస్టరీ, ఎకనామిక్స్, ఫిజిక్స్ నక్కపల్లి కళాశాలలో బోటనీ, కంప్యూటర్ సైన్స్, మేథ్స్, నర్సీపట్నం కళాశాలలో ఇంగ్లీష్ సబ్జెక్టులకు సంబంధించిన కాంట్రాక్టు లెక్చరర్లు తమ కాంట్రాక్టును పునరుద్ధరించుకోవడానికి ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించుకోవాలని కోరారు.

మొక్కలతోనే ప్రాణవాయువు

- నక్కపల్లి సొసైటీ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి



ఉపమాక రోడ్డు పక్కన మొక్క నాటుతున్న కొప్పిశెట్టి బుజ్జి

నక్కపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మానవాళికి కావలసిన ప్రాణవాయువును అందించే శక్తి వృక్షాలకే ఉందని నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. గురువారం మండలంలో ఉపమాక, నక్కపల్లి ప్రధాన రహదారి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. త్వరలో ఉపమాక పుష్కరిణి చుట్టూ ఔషధ గుణాలు కలిగిన మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, జనసేన నేత తోట అప్పారావు, టీడీపీ నాయకులు జగదీశ్వరరావు, కొప్పిశెట్టి వాసు, వరహాలరావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

110 మంది సచివాలయ ఉద్యోగులు బదిలీ

మునగపాక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో 26 సచివాలయాల నుంచి 110 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ డిజిటల్ ఇంజనీర్, వెల్ఫేర్ కార్యదర్శులు, సర్వేయర్లు, రైతు సేవా కేంద్రం అధికారులు, ఏఎన్ఎం తదితర విభాగాల్లో 165 మంది విధులు నిర్వహిస్తుండగా.. ఇటీవల జరిగిన బదిలీ ప్రక్రియలో 110 మంది వివిధ సచివాలయాలకు బదిలీ అయ్యారన్నారు. ఇప్పటివరకు 101 మందికి రిలీవ్ ఆర్డర్లు ఇచ్చామని, 92 మంది కొత్తవారు విధుల్లో చేరారని తెలిపారు.

వైసీపీకి పూర్వ వైభవం తీసుకురావాలి : ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

రాంబిల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీ పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు పార్టీ శ్రేణులు మరింతగా పాటుపడాలని ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. గురువారం మామిడివాడలోని ఆయన నివాసంలో మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీల వారీగా గ్రామాల్లోని సమస్యలను పార్టీ శ్రేణులను అడిగి తెలుసుకున్నారు. పార్టీని గ్రామాల్లో బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మండలశాఖ మాజీ అధ్యక్షుడు జి.శ్రీనుబాబు, జడ్‌పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు, నేతలు నెట్టెం సత్యనారాయణ, కొవిరి రామకృష్ణ, ఎన్‌వీఎస్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనల మేరకు అంగన్‌వాడీ కార్యకర్త నియామకం'

అచ్యుతాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేటలో అంగన్‌వాడీ కార్యకర్త నియామకం నిబంధనల మేరకు అధికారులు చేపట్టారని కూటమి నాయకులు పేర్కొన్నారు. గురువారం అచ్యుతాపురంలో జరిగిన విలేకర్ల సమావేశంలో జనపరెడ్డి శ్రీనివాసరావు, కొరుప్రోలు చిన్నారావు, రాజాన విజయ్, ద్వారపురెడ్డి బాపూజీ, పిన్నమరాజు వాసు, బుజ్జిరాజు, రాపేటి గౌతమ్ మాట్లాడుతూ నిబంధనల మేరకు ఒక దళిత మహిళకు అంగన్‌వాడీ కార్యకర్తగా నియమించారన్నారు. కొందరు ఎమ్మెల్యే సోదరులపై బురదచల్లే ప్రయత్నంలో భాగంగా పత్రికా ప్రకటనలు చేస్తున్నారన్నారు. అసత్య ఆరోపణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం : కంబాల జోగులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

పాయకరావుపేట రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం మండలంలోని పెంటకోటలో జరిగిన బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయన్నారు. వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అందరికీ పథకాలు అందాయని, కూటమి ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఇంకా పథకాలన్నీ అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, వైసీపీ నాయకులు ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, సుందర లత, ధనిశెట్టి మహేష్, జగతా శ్రీను, గెడ్డమూరి శ్రీనివాసరావు, చేపల దేవుడు, తాతాజీ పాల్గొన్నారు.

నక్కపల్లి ఈవోపీఆర్డీగా చలపతిరావు



కె.చలపతిరావు

నక్కపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి ఈవోపీఆర్డీగా కె.చలపతిరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆనందపురం మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై నక్కపల్లి మండలానికి ఈవోపీఆర్డీగా ఆయన నియమితులయ్యారు. మండలంలో అన్ని గ్రామాల్లో శానిటేషన్, సంపద కేంద్రాల నిర్వహణ తదితర అంశాలకు సంబంధించి అందరి సహకారంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వైలోవలో ఘనంగా మరిడిమాంబ జాతర



అమ్మవారి దర్శనానికి నదిలో బోటుల ద్వారా వెళుతున్న భక్తులు

రాంబిల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైలోవ గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. తమ మొక్కులు చెల్లించుకున్నారు. శారదానది ఆవతల ఒడ్డున అమ్మవారు కొలువై ఉండడంతో భక్తులు నదిలో బోట్లు, పుట్టులపై వెళ్లి అమ్మవారిని, అమ్మవారి పాదాలను దర్శించి పూజలు చేశారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్‌ను జనసేన పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పార్టీ నేతలతో కలిసి అమ్మవారిని దర్శించి పూజలు చేశారు.



అమ్మవారి పాదాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ఘనంగా నూకాలమ్మ ఉత్సవం

రాంబిల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజారాయుడు పాలెంలో గురువారం నూకాలమ్మ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానికులతో పాటు సమీప గ్రామాలైన మురకాడ, మర్రిపాలెం భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. తమ మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసంతర్పణను నిర్వహించారు. అమ్మవారి ఉత్సవం సందర్భంగా నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మహిళకు తీవ్ర గాయాలు

ఎలమంచిలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి మండలం దిమిలికి చెందిన కె.కావ్య గురువారం సాయంత్రం ఇంటి వద్ద పాడి గేదెలకు దాణా తయారు చేయడానికి కట్టెల పొయ్యి వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించి తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను బంధువులు ఎలమంచిలి సీహెచ్‌సీకి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు.

ఎస్.రాయవరం సొసైటీ చైర్‌పర్సన్‌గా నాగేశ్వరరావు బాధ్యతల స్వీకారం



నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ నాయకులు

ఎస్.రాయవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎస్. రాయవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా తుమ్మపాల నాగేశ్వరరావు, ఇద్దరు డైరెక్టర్లు కె. రమణ, జి. చినఅప్పారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. చైర్‌పర్సన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని, తనకు అప్పగించిన పదవికి న్యాయం చేస్తానన్నారు. బాధ్యతలు చేపట్టిన పాలకవర్గాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, టీడీపీ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, ముప్పిన శ్రీనివాసరావు, కరణం శివ, అవతారం, చలమల వెంకటేశ్వరరావు, జి. గోవిందరావు, పడమర సతీష్, జనసేన నేత తేటకాలి అరవింద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దాలి

- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో విద్యా వ్యవస్థ రాష్ట్రంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు విద్యా శాఖాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని జడ్పీ అతిథిగృహంలో నాలుగు మండలాల ఎంఈవోలు, క్లస్టర్ పరిధి ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ.. ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తీర్చిదిద్దడమే ధ్యేయమన్నారు. ఇందుకు ఉపాధ్యాయులతోపాటు గ్రామస్థులు, తల్లిదండ్రులు తమ వంతు సహకారం అందించాలన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత తొలిసారి అసెంబ్లీ సమావేశాల్లో ఆటిజం కలిగిన పిల్లల కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరడంతో విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించి పలు చోట్ల ఆటిజం కేంద్రాలను మంజూరు చేశారన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా ప్రేరణ కలిగించాలన్నారు. అనంతరం ఉద్యానవన శాఖ, గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులతోనూ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గం కోసం వ్యూహాత్మక ప్రణాళిక, సమగ్ర వ్యవసాయ అభివృద్ధి, మార్కెట్ అనుసంధానం మెరుగుదలపై అధికారులతో చర్చించారు. భవిష్యత్తు ప్రణాళికలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. నియోజకవర్గంలో పనుల ప్రగతి రోజూ ముందుకు సాగాలని, అందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఫలించిన బొలిశెట్టి వ్యూహం

- కోరం లేక వాయిదా పడిన ఎంపీపీ ఎన్నిక
- హాజరైన టీడీపీకి చెందిన ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు



ఎంపీపీ ఎన్నికకు హాజరైన ముగ్గురు సభ్యులు

ఎస్.రాయవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తాత్కాలికంగా వచ్చిన ఎంపీపీ పదవిలో కొన్నాళ్లు తానే కొనసాగడం కోసం ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు రచించిన వ్యూహం ఫలించింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎంపీపీ ఎన్నిక కోరం లేక వాయిదా పడింది. మొత్తం 20 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను టీడీపీకు చెందిన ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. మిగతా సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో కోరం లేక ఎంపీపీ ఎన్నిక వాయిదా వేస్తున్నట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

మండలంలో మొత్తం 21 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను ఒకరు మృతి చెందడంతో ప్రస్తుతం 20 మంది సభ్యులు ఉండగా వీరిలో 16 మంది వైసీపీకి చెందిన వారు. మిగతా నలుగురిలో ముగ్గురు టీడీపీ, ఒకరు జనసేన ఎంపీటీసీ సభ్యులున్నారు. అయితే ఉదయం 11 గంటల నుంచి ఎంపీపీ ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా, టీడీపీకు చెందిన ఎంపీటీసీ సభ్యులు సియ్యాదుల వరహాలమ్మ, కొక్కిలూరి మంగ, నకరబోయిన వెంకటలక్ష్మి మినహా మిగతా సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల ఆర్‌వో వేచి చూశారు. అప్పటికి కూడా ఎవరూ రాకపోవడంతో కోరం లేక ఎంపీపీ ఎన్నిక వాయిదా పడిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె. మనోరమ, ఎంపీడీవో సత్యనారాయణ ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం నిర్వహించిన ఎంపీపీ ఎన్నికకు ముగ్గురు మినహా సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో మరలా ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసే వరకు వాయిదా వేశామన్నారు. ఇదిలావుంటే ఎన్నిక వాయిదా పడితే తాత్కాలికంగా ఉన్న తానే ఎంపీపీగా కొనసాగవచ్చని గ్రహించిన బొలిశెట్టి గోవిందరావు వ్యూహాన్ని రచించారు. అదే వ్యూహాన్ని అమలు చేసి ఎన్నిక వాయిదా పడేలా చేశారు. దీంతో మరలా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు గోవిందరావు ఎంపీపీగా కొనసాగనున్నారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు



బృందావనంలో కరపత్రాలు అందజేస్తున్న యాళ్ల వరహాలు తదితరులు

పాయకరావుపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధితోపాటు పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు అన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నాయకులు బృందావనంకాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిన్నింటి సూరిబాబు, గొల్లపల్లి నాగు, రాజాన ఆది, చిలుకూరి పేర్రాజు పాల్గొన్నారు.



పూడిమడకలో భారీగా ప్రచారంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

పూడిమడకలో..

అచ్యుతాపురం: టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు అన్నివిధాల మేలు జరిగిందని పూడిమడక మాజీ సర్పంచ్ మేరుగు బాపునాయుడు అన్నారు. గురువారం పూడిమడకలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు వేట నిషేధ భృతిని రూ.20వేలకు కూటమి ప్రభుత్వం పెంచిందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా?లేదా? అని అడిగి తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో మేరుగు వెంకటరావు, చోడిపల్లి అప్పారావు, ఎరిపల్లి కాసుబాబు, పోలయ్య, చింతకాయల సత్తెయ్య, మేరుగు మహేష్, పేర్ల పైడికొండ పాల్గొన్నారు.

19న పలు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి డివిజన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు నిర్వహించడానికి ఈనెల 19వ తేదీన పలు మండలాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాయకరావుపేట మండలంలో పీఆర్‌బీ పురం, సీహెచ్.నరసాపురం, పాల్తేరు, అంకంపేట, నక్కపల్లి మండలంలో గొడిచెర్ల, ఉద్దండపురం, చేరిక కొత్తూరు, యు.జానకయ్యపేట, చిన్న రామభద్రపురం, వేంపాడు, గుల్లిపాడు, రైల్వే స్టేషన్, ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, నీలాద్రిపురం, పెదబోదిగల్లం, రామకృష్ణాపురం, సీతమ్మపాలెం, పెద్ద దొడ్డుగల్లు, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, క్రొవ్విడివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు, ఎలమంచిలి మండలంలో పులపర్తి, పీఎస్ఆర్‌పేట, బయ్యవరం, కొండకర్ల సబ్‌స్టేషన్ పరిధిలో కొండకర్ల, యర్రవరం, ఉప్పవరం, మల్లవరం, నరేంద్రపురం, ఎంజెపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులకు ఘన సన్మానం



బదిలీపై వెళుతున్న ఉద్యోగులను సన్మానించిన దృశ్యం

కోటవురట్ల, జూలై 17 (ఆంధ్ర జ్యోతి): సచివాలయ ఉద్యోగులు అందించిన సేవలు అభినందనీయమని కోటవురట్ల సర్పంచ్ అనిల్ కుమర్ అన్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శి డీఎల్ నర్సింహం ఆధ్వర్యంలో బదిలీపై వెళుతున్న సచివాలయ 1, 2 ఉద్యోగులను పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వర్తించిన ఉద్యోగికి ఎల్లప్పుడు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల వద్ద ప్రత్యేక గుర్తింపు ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సూర్యరావు, పంచాయతీ కార్యదర్శులు సురేష్ నాయుడు, దేవ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ రామకృష్ణ, మహిళ పోలీసులు అనిమిరెడ్డి భారతి, నాగజ్యోతి, హార్టికల్చర్ అసిస్టెంట్ గీత, సర్వేయర్ ఎంకృష్ణ, ఏఎన్ఎం పార్వతమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు.

కాలువ ఇలా.. సాగు ఎలా..?

పరవాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ఊర చెరువు నుంచి స్థానిక కోనాం చెరువులోకి నీరు ప్రవహించే పంట కాలువ తుప్పలతో నిండిపోయింది. సుమారు కిలో మీటరు మేర ఉన్న ఈ కాలువ ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యానికి గురికావడంతో ఏడాది పొడవునా నీటితో కళకళలాడే కోనాం చెరువులో అంతంత మాత్రంగానే నీరుంది. ఈ కారణంగా ఊర చెరువు, కోనాం చెరువు ఆయుకట్టు రైతులు గత ఏడాది అనుకున్నంత మేర వరి పంట సాగు చేయలేకపోయారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. మేజర్ పంచాయతీ పరవాడకు చెందిన సుమారు 60 శాతం మంది రైతులు స్థానిక ఊర చెరువు, కోనాం చెరువులపైనే ఆధారపడి వరి సాగు చేస్తుంటారు. ఊర చెరువు నుంచి నీరు కోనాం చెరువులోకి పారేందుకు కిలో మీటరు పొడవునా పంట కాలువ ఉంది. ఈ కాలువ ద్వారా వచ్చే నీరు కోనాంలోకి చేరేది. అక్కడ నుంచి రైతులు తమ పొలాలకు నీరును మళ్లించుకునేవారు. ఇది గతం... ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఊర చెరువు నుంచి కోనాం చెరువు వరకు ఉన్న పంటల కాలువ పూర్తిగా తుప్పలతో నిండిపోయింది. పెద్ద పెద్ద ముళ్ల పొదలు పెరిగిపోయాయి. దీంతో కాలువలోంచి నీరు పారే అవకాశం కూడా లేకుండా పోయింది.


కాలువను మట్టితో పూడ్చి వేసిన దృశ్యం

- తుప్పలతో నిండిపోయిన పంట కాలువ
- పట్టించుకోని ఇరిగేషన్ శాఖ అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతాంగం

కొందరు వ్యక్తుల స్వార్థం వల్లే సమస్య!

ఈ కాలువ పట్ల ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది వ్యక్తులు కాలువ అవతల వైపు ఉన్న తమ పొలాల్లో మట్టిని వేసి చదును చేయించుకునేందుకు పంట కాలువలను కప్పేశారు. దాని మీదుగా లారీలతో తమ స్థలాల్లో మట్టిని వేయించుకున్నారు. పంటల కాలువను మట్టితో పూడ్చివేసినా పట్టించుకునేవారే లేకపోయారు. ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యం కారణంగానే ఇక్కడ ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు.

తగ్గిన వరి పంట విస్తీర్ణం...

పంట కాలువలో పూడికతీత పనులు చేపట్టకపోవడం వల్ల గత ఏడాది వరి పంట విస్తీర్ణం చాలా తగ్గిపోయింది. పొలాలకు నీరు మళ్లించుకునే అవకాశం లేకపోవడం వల్ల రైతులు వరి పంటపై ఆసక్తిని చూపలేకపోయారు. దీంతో చాలా పొలాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమకు ఈ దుస్థితి దాపరించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉపాధి హామీ పథకం కింద పంట కాలువల్లో పూడిక తీత పనులు చేయించేవారని, గత రెండేళ్లుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో కాలువ నిర్లక్ష్యానికి గురైందని రైతులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలువలో పెరిగిపోయిన తుప్పలు, ముళ్లపొదలు తొలగించి, నీరు పారేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


తుప్పలతో నిండిపోయిన పంట కాలువ

గత ఏడాది వరి వేయలేదు



కాలువలో తుప్పలు, ముళ్ల పొదలు పెరిగిపోయాయి. నీరు పారే అవకాశం లేదు. దీంతో గత ఏడాది వరి పంట వేయలేదు. ఈ ఏడాది కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఉన్న కొద్దిపాటి భూమి ఖాళీగానే ఉంది. గతంలో ఉపాధి కూలీల ద్వారా పూడికతీత పనులు చేయించేవారు. గత రెండేళ్లుగా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో కాలువ తుప్పలతో నిండిపోయింది.

పైలా కన్నంనాయుడు, రైతు

అధికారులు పట్టించుకోవాలి



కాలువ నుంచి నీరు పారే అవకాశం లేదు. ఇలాగైతే పొలాలకు నీరు ఎలా మళ్లించుకోవాలి. తుప్పలతో నిండిపోయిన కాలువను గత రెండేళ్లుగా ఇరిగేషన్ అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దారుణం. ఇలాగైతే పంటలు ఎలా పండించుకోవాలో అర్థం కావడం లేదు.. పూడిక తీతపనులు చేపటేందుకు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలి.

- గండి అప్పలనాయుడు, రైతు

ఎట్టకేలకు స్కేటింగ్ పార్కుకు గేటు ఏర్పాటు


లక్ష్మీనారాయణనగర్ స్కేటింగ్ పార్కుకు గేటు ఏర్పాటు చేసిన దృశ్యం

అనకాపల్లి టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీనారాయణనగర్‌లో స్కేటింగ్ పార్కుకు వెళ్లే రౌండ్ సర్కిల్ గేటును ఎట్టకేలకు జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఆరు నెలల క్రితం 'అక్షరమే అండగా పరిష్కారమే ఎజెండాగా' ఆంధ్ర జ్యోతి నిర్వహించిన చర్చా వేదికలో ఆ ప్రాంతవాసులు స్కేటింగ్ పార్కు అభివృద్ధి, గేటు లేకపోవడాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఎటువంటి స్పందన లేకపోవడంతో పలు దఫాలు స్థానికులు ఈ విషయాన్ని అధికారులకు విన్నవించుకున్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి పార్కును పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం అధికారులు రౌండ్ సర్కిల్ గేటును ఏర్పాటు చేయించారు.



బెల్టు షాపులు నిర్వహిస్తే ఉపేక్షించం : డీఎస్పీ


మద్యం దుకాణాల యజమానులతో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

పరవాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ హెచ్చరించారు. మద్యం దుకాణాల యజమానులతో గురువారం రాత్రి ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. షాపుల నుంచి బెల్టుషాపులకు మద్యం సరఫరా చేయడం చట్ట విరుద్ధమన్నారు. ప్రధాన షాపుల వద్ద బారుల వలే ఏర్పాటు చేసుకొని అమ్మకాలు సాగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు సాగించాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం : జడ్సీ


జడ్సీ చక్రవర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ జిల్లా నాయకులు

అనకాపల్లి టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సిబ్బందికి సూచించారు. పూడిమడక రోడ్డులో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. సిబ్బంది కాలువల్లో చెత్తను తీస్తున్న తీరును పరిశీలించారు. ఇటువంటి చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. కాలువల్లో పూడికలు తొలగించాలని పలువురు ఆయనను కోరగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. క్యాంటీన్‌తో పాటు పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఇదిలావుంటే, జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన చక్రవర్తిని బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, అనకాపల్లి కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, జిల్లా నాయకులు నాగమణి, అంబేడ్కర్, పార్టీ మండల అధ్యక్షుడు నరసింగ్‌యాదవ్, అనకాపల్లి మండల జనరల్ సెక్రటరీ సేనాపతి అప్పారావు తదితరులు కలిసి స్థానిక సమస్యలను వివరించారు.

'చెరువులో మట్టి తవ్వకాలు ఆపకుంటే ఆందోళన'


రాయపురాజు చెరువును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లలపాలెం, నంగినారపాడు గ్రామాల రెవెన్యూ పరిధిలో గల రాయపురాజు చెరువులో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను అధికారులు అడ్డుకోవాలని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ డిమాండ్ చేశారు. సదరు చెరువును స్థానిక నేతలతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 47 సెంట్లకు అనుమతులు అని చెప్పి కొంత మంది ఇష్టానుసారంగా రాత్రివేళల్లో తవ్వి తరలించేస్తున్నారని ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి తవ్వకాలు ఆపకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు గండి రవికుమార్, సర్పంచ్‌లు మోపాడ అప్పారావు, వడ్డాది అప్పలరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబు, ధనిమిరెడ్డి శ్రీను, కొమ్ము కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

'పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి'

తుమ్మపాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పలువురు పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఐవీఆర్ఎస్ సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై అవగాహన అవసరం

సబ్బవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల తీరు తెన్నులపై చర్చించేందుకు సామాజిక తనిఖీపై ప్రజలు, ప్రజా ప్రతినిధులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో పి.పద్మజ అన్నారు. అసకపల్లిలో గురువారం ఉపాధి పథకం అధికారులు ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గతేడాది నుంచి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అన్ని పనులకు సంబంధించిన చిత్రాలను సమావేశంలో ప్రదర్శించి, అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన గ్రామ సభలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో ఈ ఏడాది రూ.1.7 కోట్ల ఉపాధి హామీ నిధులతో అభివృద్ధిపనులు జరిగాయన్నారు. సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, ఉప సర్పంచ్ కరణం సురేశ్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అప్పులు.. కూటమి పాలనలో అభివృద్ధి

- ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ


ముత్యాలమ్మపాలెంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న గండి బాబ్జీ

పరవాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అప్పుల కుప్పగా మార్చిన రాష్ట్రాన్ని కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే గాడిలో పెడుతోందని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన ముత్యాలమ్మపాలెంలో టీడీపీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అనంతరం పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయకులు గండి వంశీ, అర్జిల్లి దేవి, అర్జిల్లి రవి, బొండా సన్నిదేముడు, లాలం ఈశ్వరరావు, చింతకాయల ముత్యాలరావు, నగిరెడ్డి చిన్నారావు, చింతకాయల అమ్మోరు, సూరాడ ముత్యాలరావు, చిక్కాడ నరసింగరావు, సమ్మంగి సోమేశ్వరరావు, ఒలిశెట్టి అప్పలరాజు, చింతకాయల మహేష్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.


సంతోషిమాత ఆలయ సమీపంలో మహిళకు కరపత్రం అందిస్తున్న సురేంద్ర

గవరపాలెం సంతోషిమాత ఆలయం ఆవరణలో...

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని 81వ వార్డు గవరపాలెం సంతోషిమాత ఆలయం ఆవరణలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్వహించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ మహిళలకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటు అభివృద్ధికి, అటు సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ప్రజలకిచ్చిన హామీలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాడి వాసు, పీలా శ్రీనివాసరావు, పెట్ల శ్రీను, ఆళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహణ పనులు చేపట్టనున్న కారణంగా పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. సబ్బవరం, జోడుగుళ్ల జంక్షన్, పెదనాయుడుపాలెం, గొల్లలపాలెం, ఆదిరెడ్డిపాలెం, చిన్నయ్యపాలెం గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సమస్యలపై వినతి


వినతిపత్రం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం కోరారు. ఈ మేరకు గురువారం డీపీటీవో కార్యాలయ అధికారి వెంకటేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. వర్షం పడితే కాంప్లెక్స్ ఆవరణ అంతా నీరు నిలిచిపోతుందని, దీనివల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరారు. ఆయన వెంట అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

తుమ్మపాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ రావు అన్నారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా గురువారం చేనుల అగ్రహారంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు, చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలన్నారు. ముఖ్యంగా దోమలు వృద్ధి చెందకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్లు బాధ్యతలు స్వీకారం


అనకాపల్లి తహశీల్దార్‌కు సిబ్బంది ఘన స్వాగతం

అనకాపల్లి టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి తహశీల్దార్‌గా ఎం.భాస్కరఅప్పారావు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. పాడేరు జిల్లాలో తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై విచ్చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న విజయ్‌కుమార్ కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా వెళ్లారు.


కశింకోట తహసీల్దార్ కార్యాలయంలో...

కశింకోట : ఇక్కడి తహశీల్దార్‌గా సీహెచ్.తిరుమలరావు బాధ్యతలు స్వీకరించారు. పాడేరు కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ బదిలీపై బదిలీపై విచ్చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించిన సత్యనారాయణ అచ్యుతాపురానికి బదిలీ అయ్యారు.


పరవాడ తహసీల్దార్ కార్యాలయంలో...

పరవాడ : పరవాడ తహశీల్దార్‌గా బి.నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. పాడేరు కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తూ ఇక్కడకు బదిలీపై విచ్చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న ఎస్‌వీ అంబేడ్కర్ రావికమతం మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన తహసీల్దార్లకు సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి ఘన స్వాగతం పలికారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ


చెక్కును అందజేస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

తుమ్మపాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కష్టాల్లో ఉన్న పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి రూ.4.8 లక్షల చెక్కులను ఇక్కడి టీడీపీ కార్యాలయంలో గురువారం అందజేసి మాట్లాడారు. పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదంశెట్టి నీలబాబు, తలారి కాశీనాయుడు, రాపేటి రాము, కరణం రమణ, వేగి కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి'


టీకాల ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్థక శాఖాధికారి

కశింకోట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలు వయసు దాటిన సంకరజాతి పశువులన్నింటికీ ఉచిత థైలేరియా వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు సూచించారు. కశింకోటలో గురువారం పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. గోమార్లు కుట్టడం వల్ల పశువులకు థైలేరియా వ్యాధి సోకుతుందన్నారు. దీనివల్ల తీవ్ర జ్వరం, పాల దిగుబడి తగ్గిపోవడం, లింఫ్‌గ్రంథులు వాచిపోవడం, రక్తహీనత కారణంగా పశువులు చిక్కిపోవడం చివరగా శ్వాస ఆడకపోవడం వంటివి జరుగుతాయన్నారు. ఈ వ్యాధి సంకరజాతి, విదేశీ జాతి పశువుల్లో ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారిణి డాక్టర్ సిహెచ్.చైతన్యమణి, పశు సంవర్థక శాఖ సహాయకుడు బి.ఈశ్వరరావు, గోపాల మిత్ర మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

నిమ్న వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలి

- అధికారుల సమీక్షలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్

అనకాపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నిమ్నవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హాల అధ్యక్షతన జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో త్వరితగతిన విచారణ జరిపి పరిష్కారం చూపాలన్నారు. ఎఫ్ఐఆర్‌లు నమోదులో జాప్యం చేయరాదని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్న వర్గాల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అందేలా చూడాలల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఉపాధి హామీ పథకం అందరికీ అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పరిశ్రమలు, ఇతరత్రా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హాలు జిల్లాలో ఎస్సీ వర్గాల అక్షరాస్యత, వివిధ పథకాల అమలు, ఆరోగ్యం, పోషణ, భూ పంపిణీ, నవోదయం తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిషన్ సభ్యుడికి వివరించారు. ఈ సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌బాబు, ఇన్‌చార్జి డీఆర్వో సుబ్బలక్ష్మి, ఆర్డీవో షేక్ ఆయిషా, ఎస్సీ సంక్షేమ ఏడీ రామానందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్



పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయంలో కొనసాగేతున్న సహకార సంఘ కార్యాలయం



మరమ్మతులకు నోచుకోక తుప్పుపట్టిపోతున్న ట్రాక్టర్

కొయ్యూరు పీఏసీఎస్‌కు వసతి సమస్య

- నాలుగు దశాబ్దాలుగా సొంత భవనానికి దూరం
- మూలకు చేరిన రైతుల అద్దెకు ఇవ్వాల్సిన ట్రాక్టర్

కొయ్యూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరులో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి సొంత భవనం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రైతులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించేందుకు 1987లో టీడీపీ ప్రభుత్వం ఈ పీఏసీఎస్‌ను మంజూరు చేసింది. అప్పటి నుంచి కమ్యూనిటీ హాల్‌లో దీనిని కొనసాగించారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిని చీడిపాలెం పంచాయతీ సింగవరంలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలోకి మార్చారు. 3,487 మంది సభ్యులు గల ఈ పీఏసీఎస్‌లో రూ. 45.79 లక్షల మేర మూలధనం ఉంది. ఏటా సభ్యులకు సుమారుగా రూ 3.50 కోట్ల మేర రుణాలు అందిస్తున్నారు. ఇంత అధిక మొత్తం టర్నోవర్ కలిగిన ఈ పీఏసీఎస్‌కు నేటికీ సొంత భవనం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న భవనం మరమ్మతులకు లోనై ఉంది. ఈ భవన మరమ్మతుల విషయమై ఇప్పటికే పలు దఫాలు పాలకుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు లేవు. సొంత భవనం నిర్మాణాలకు వీలుగా నిధులు కేటాయింపునకు గానూ సంఘ కార్యదర్శి సత్యనారాయణ నాబార్డుకు నివేదించినా ఫలితం శూన్యంగానే మిగిలింది. దీంతో సొసైటీ ఏర్పాటు నుంచి నేటి వరకు సొంత భవనానికి నోచుకోకపోవటం విమర్శలకు తావిస్తోంది. అయితే, 2019కి ముందు ప్రభుత్వాల హయాంలో ఈ సొసైటీల నిర్వహణకుగానూ ప్రత్యక్ష ఎన్నికల ద్వారా పాలక వర్గాలను ఏర్పాటు చేశారు. దీంతో కొన్ని అత్యవసరాలకు పాలకవర్గం నిర్ణయంతో మూలధనం వడ్డీలో నిధులు వెచ్చించే అవకాశం ఉండేది. వైసీపీ ప్రభుత్వం సొసైటీలపై పట్టు సడలిపోకుండా ఉండేందుకు ఎన్నికల జరపకుండా నామినేటెడ్ పాలకవర్గాలను ప్రతీ ఆరు మాసాలకోసారి కాలపరిమితి పెంచుకుంటూ వచ్చింది. సొసైటీ నిర్వహణ, రైతు సంక్షేమం మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ క్రమంలో దశాబ్దాల కిందట రైతుల వ్యవసాయ అవసరాలు తక్కువ వ్యయంతో తీర్చేందుకు వీలుగా అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ట్రాక్టరు అందించింది. వ్యవసాయ సీజన్‌లో దుక్కి, దమ్ము, నూర్పు తదితర అవసరాలకు నామ మా త్రపు అద్దె చెల్లించి రైతులు వినియోగించుకునేలా నిర్ణయించారు. అయితే ఐదేళ్ల కిందట వరకు ట్రాక్టరు నిర్వహణ సక్రమంగా జరిగినా అనంతరం వైసీపీ ప్రభుత్వం ధర్మమా అని లక్షలు వెచ్చించి ఇచ్చిన ట్రాక్టరునుపట్టించుకునే నాథుడు లేక మూలకు చేరింది.

ఒక్క కొయ్యూరులోనే కాకుండా అప్పట్లో సరఫరా చేసిన చింతపల్లి, గూడెం, జి. మాడుగుల, ముంచంగిపుట్టు మండలాల్లో ట్రాక్టర్ల పరిస్థితి ఇలానే ఉంది. ఇకనైనా ప్రభుత్వం పట్టించుకుని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల నిర్వీర్యం కాకుండా వాటి నిర్వహణకు అవసరమైన భవన సదుపాయం కల్పించడంతో పాలకవర్గాల ఎన్నికలు నిర్వహించి పూర్వ వైభవం కల్పించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- ప్రజా దర్బార్‌లో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

పాడేరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తామని తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఫలితంగా ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి నోచుకోవడంతో ప్రజలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి ఆయన వినతులను స్వీకరించి, సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. హుకుంపేటకు చెందిన జి.వసంతరాణి తన భూమి వ్యవహారం కోర్టులో ఉండగానే ప్రత్యర్థులు ఆ భూమిని స్వాధీనం చేసుకుంటున్నారని తెలపగా, ఈ సమస్యపై సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్‌తో మాట్లాడారు. అలాగే అరకులోయ మండలం మాడగడ వ్యూపాయింట్ వద్ద పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని ఆటో యూనియన్ ప్రతినిధులు కోరగా, దీనిపై డీఎస్పీ షహబాజ్ అహ్మద్‌తో మాట్లాడారు. డుంబ్రిగుడ మండలం తడ్డా గ్రామానికి మంజూరైన రోడ్డుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలని పలువురు కోరగా, అటవీ శాఖాధికారులతో చర్చించారు. ఇలా అనేక మంది గిరిజనులు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను జీసీసీ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సాగర సుబ్బారావు, పాండురంగస్వామి, వాసుదేవ్, అమ్మన్న, ప్రసాద్, రామలింగం, మురళీ, లైకోన్, కిశోర్, కళావతి, అచ్చిబాబు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యం లేకుండా ఆధార్ సేవలు


బంగారమ్మపేట ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

కొయ్యూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డుల్లో తప్పొప్పులను సరిచే యించుకునే వారికి అసౌకర్యం కలుగకుండా సేవలందించాలని స్థానిక ఎంపీడీవో వీడీకే ప్రసాద్ సూచించారు. గురువారం బంగారమ్మపేటలోని నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌ను ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ ప ంచాయతీల నుంచి ఆధార్ సీడింగ్ వచ్చిన వారితో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సాంకేతిక పరమైన సమస్య ఉన్నా తక్షణం తన దృష్టికి తేవాలని సిబ్బందికి సూచించారు. ఆధార్ నమోదులో ఇబ్బంది లేకుండా సకాలంలో వారి పనులు పూర్తి చేసి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంట అంతాడ సచివాలయ డీఏ ప్రసాద్, ఈవోపీఆర్‌డీ నా యుడు తదితరులు పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి


కొత్తవలస పాఠశాలను సందర్శించిన విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు వంతల దేవదాస్

అనంతగిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు వంతల దేవదాస్ అన్నారు. మండలంలోని కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ముందుగా పాఠశాల నిర్వహణపై అడిగితెలుసుకుని, అనంతరం మెనూ పరిశీలించారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, తదితర సమస్యలు అధికంగా ఉన్నాయని, వీటిపై ఉన్నతాధికారులు స్పందించి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు, బీజేపీ నాయకులు రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి


వరి నాట్ల వేయడంపై సూచలందిస్తున్న ఏవో మురళీకృష్ణ

ముంచంగిపుట్టు, జులై 17 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో చిన్నపాటి మెలకువలు పాటిస్తే పంట దిగుబడి బాగుంటుందని మండల వ్యవసాయ అధికారి గిరడ మురళీకృష్ణ అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని చోటాముఖిపుట్టు గ్రామాన్ని సందర్శించి, రైతులకు అవగాహన కల్పించారు. వరి నాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.దామదర రైతు పొలంలో వరి వరుస పద్ధతిలో విత్తిన వరి నాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా వ్యవసాయ సాగు చేయాలని, పలు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఆర్గనైజర్ ఆనంద్, రామస్వామి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమ శిక్షణతో చదువు కోవాలి


విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందిస్తున్న సర్పంచ్ త్రినాథ్

ముంచంగిపుట్టు, జులై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కె.త్రినాద్ అన్నారు.పంచాయతీ పరిధిలో గల దాబుగూడ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం అందించిన తల్లికివందనలో భాగంగా వచ్చిన సొమ్మును వృథా చేయకుండా తల్లిదండ్రులు స్టడీమెటీరియల్ కొనుగోలు అభినందనీయమని అన్నారు. అలాగే, తక్కువ దరకు ఈమెటీరియల్ సమకూర్చిన ఉపాధ్యాయుడు రంజిత్‌ను అభినందించారు.

ఆశ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ముంచంగిపుట్టు, జులై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిలగాడ పీహెచ్‌సీ పరిధిలో ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్తల పోస్టులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు వైద్యాధికారిణి శిరీష తెలిపారు. వంగనాపల్లి, కుమ్మరిపుట్టు, పెద్దతమిగుల, కిలగాడ(పెద్దవీధి), పనస గ్రామాలకు సంబంధించి కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 18వ తేదీ లోపు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒకొక్క గ్రామం నుంచి గ్రామ ఆరోగ్య, పారిశుధ్య కమిటీ (వీహెచ్ఎస్ఎన్‌సీ) ఆమోదం తెలిపిన మూడు ద రఖాస్తులను మాత్రమే పరిగణంలోకి తీసుకుంటామన్నారు.

చింతపల్లి తహశీల్దార్‌గా ఆనందరావు


చింతపల్లిలో బాధ్యతలు స్వీకరించిన ఆనందరావు


జీకే వీధి తహశీల్దార్‌గా అన్నాజీరావు

చింతపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ తహసీల్దార్‌గా జి. ఆనందరావు నియమితులయ్యారు. రెండు నెలల క్రితం ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న బి. రవికుమార్ గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. దీంతో జీకే వీధి తహసీల్దార్ టి. రామకృష్ణకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజా పదోన్నతుల్లో రావికమతం రెవెన్యూ కార్యాలయంలో ఉప తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆనం దరావుని పదోన్నతి కల్పిస్తూ చింతపల్లిలో నియమించారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డీటీలు చంద్రశేఖరరావు, బాలన్నదొర, ఆర్ఐ కృష్ణ మూర్తి, రెవెన్యూ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

జీకేవీధి తహశీల్దార్‌గా అన్నాజీరావు

గూడెంకొత్తవీధి: స్థానిక తహసీల్దార్‌గా హెచ్. అన్నాజీరావు నియమితులయ్యారు. తాజా బదిలీల్లో ఇక్కడ ఏడాదిపాటు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన టి. రామకృష్ణను గ్రేటర్ విశాఖకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జిల్లా కలెక్టరేట్‌లో ఉప తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అన్నాజీరావుని పదోన్నతి కల్పిస్తూ జీకే వీధి తహసీల్దార్‌గా నియమించారు. ఈమేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఉప తహసీల్దార్లు సీతారామ్, దుమంతి సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ చిన్నయ్యపడాల్, ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

జి.మాడుగుల తహశీల్దార్‌గా రాజ్‌కుమార్


జి. మాడుగుల తహశీల్దార్‌గా రాజ్‌కుమార్

జి.మాడుగుల: స్థానిక తహసీల్దార్‌గా గిడ్డి రాజ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఈయన ఎఫ్ఏసీ విధానంతో ఇక్కడి తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ జి.మాడుగుల తహసీల్దార్‌గా ఉత్తర్వులు జారీ చేయడంతో పూర్తి బాధ్యతలు స్వీకరించారు. దీంతో పలువురు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని దృష్టికి గిరిజన ప్రాంత సమస్యలు


మాధవ్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా నాయకులు


చింతపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత సమస్యలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకరపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం విశాఖపట్నంలో మాధవన్‌ను జిల్లా నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆదివాసీలకు శతశాతం ఉద్యోగాలు కల్పనకు సంబంధించిన జీవో 3 పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. శివారు గిరిజన గ్రామాలకు రహదారులు, మంచి నీటి పథకాలు నిర్మాణానికి కృషి చేయాలని విన్నవించామన్నారు. మాధవ్ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోనంగి బాలయ్యపడాల్, కదుళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ మేరకు భోజనాలు : ఎంపీడీవో


ఉపాధ్యాయురాలితో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

చింతపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ఆధారంగా రుచికరమైన భోజనాలు పెట్టాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి తెలిపారు. గురువారం కుడుముసారి పంచాయతీలో గ్రామ సచివాలయం, స్థానిక ప్రభుత్వ పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులకు తల్లికి వందనం నగదు అందించి, ఎంత మందికి రాలేదు.. కారణాలు ఏమిటి తదితర అంశాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎం పీడీవో మాట్లాడుతూ అర్హులందరికీ తల్లికి వందనం అందించినట్టు చెప్పారు. గ్రామంలో జన్మించిన ప్రతి శిశువుకి ఆస్పత్రిలో జనన ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నారు. ఆధార్ కార్డులేని విద్యార్థులను చింతపల్లి మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరానికి పంపించాలన్నారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోటేశ్వరరావు, కూటమి నాయకులు తిరిబాబు, పాంగి మోహన్‌రావు, సన్యాసిరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మువ్వల భాస్కరరావు, కార్యదర్శి ముక్కలి వెంకట రమణ పాల్గొన్నారు.


బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడా పాఠశాల విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయిపోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్ రాజాబాబు

అరకులోయ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తణుకు మహిళా కళాశాలలో ఈ నెల 18 వ తేదీ నుంచి 20వ తేదీ వరకు చిట్టూరి సుబ్బారావు గోపీచంద్ అకాడమి ఆధ్వర్యంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో అరకు క్రీడా పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, బాడ్మింటన్ కోచ్ కె.రాజాబాబు తెలిపారు. అండర్ -2 విభాగంలో కె. జెర్మిపాల్, కేవీ చరణ్‌కుమార్, జి.సాయిరాం, అండర్-13 లో బి.సుజిత్, బి.యశ్వంత్‌తేజ్, ఎస్.జగదీష్, అండర్-15 విభాగంలో పి.మహేందర్ దాస్, బి.శశిధర్‌రెడ్డి, బి.రాజారితేస్, ఎస్.రాజేశ్‌రెడ్డి ఎంపికైనవారిలో ఉన్నారు. మరింత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని కోరారు.

ముంచంగిపుట్టు తహశీల్దార్‌గా శంకర్‌రావు


తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శంకర్‌రావు

ముంచంగిపుట్టు, జులై 17 (ఆంధ్రజ్యోతి): మండల తహశీల్దార్ కె.శంకర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహశీల్దార్ పని చేసిన ఆర్.వి.ఎస్.నర్సమ్మ పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో అనకాపల్లి జిల్లా రోలుగుంట తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ పని చేస్తున్న శంకర్‌రావును పదోన్నతిపై ముంచంగిపుట్టు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. నూతన తహశీల్దార్‌ను ఆర్ఐలు, సిబ్బంది రవికుమార్, భూపతిపడాల్, మత్స్యరాజు, రమేష్‌లు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

పొలిటికల్ జేఏసీ చైర్మన్‌గా రీమల నవభారత్


నూతనంగా ఎన్నికైన పొలిటికల్ జేఏసీ నాయకులు

చింతపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ రీమల నవభారత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం గిరి జనజాగృతి సమన్వయ సమితి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు పార్టీల నుంచి జేఏసీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌తోపాటూ ప్రధాన కార్యదర్శిగా దుక్కెరి ప్రభాకరరావు (బీజేపీ), గౌరవ అధ్యక్షులుగా జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య (వైసీపీ), ముఖ్య సలహాదారులుగా పెదిరెడ్ల బేతాళుడు(టీడీపీ) జల్లి సుధాకర్ (వైసీపీ), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గిరి జనజాగృతి సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముర్ల వెంకట రమణ, కార్యనిర్వాహక కార్యదర్శిలుగా ఉపాధ్యాయులు లోచల రామకృష్ణ, ఉగ్రంగి వెంకటగిరి, కొర్ర మల్లేశ్వరరావు, సుర్ల వీరేంద్ర (జనసేన), మాజీ డీసీసీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా ఎంపీపీ కోరాబు అనుషదేవి (వైసీపీ), మోరి రవి (వైసీపీ) గెమ్మెలి మోహన్‌రావు, కొర్ర బలరామ్ (టీడీపీ) టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, జనసేన మండలాధ్యక్షుడు బుజ్జిబాబు, రీమల ఆనందరావు(టీడీపీ) ఎన్నికయ్యారు.

'బదిలీల పేరుతో విధులకు డుమ్మా సరికాదు'

జి.మాడుగుల, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయ సిబ్బంది బదిలీల పేరుతో విధులకు హాజరుకావడం లేదని పెసా మండల ఫోరం అధ్యక్షుడు లకే రామకృష్ణ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ, తల్లికి వందనం, ఇతర సేవల కోసం ప్రజలు సచివాలయాలకు వెళ్తే.. సిబ్బంది అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఖరీఫ్ సాగు పనులు వదులుకుని సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్న తాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమి టీ నాయకులు కె.శ్రీను, వీర్రాజు. సోమన్నదొర, కొండబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

గూడెంకొత్తవీధి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వ సభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం: హౌసింగ్ పీడీ


నూకరాయితోటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ బాబునాయక్

కొయ్యూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పీటీజీల గృహాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం పెంచినందున నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి. బాబు నాయక్ సూచించారు. గురువారం మండలంలోని బూదరాళ్ళ పంచాయతీలో ఆయన పర్యటించారు. బూదరాళ్ళ, లోయలపాలెం, నూకరాయితోట తదితర గ్రామాలలో గృహనిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. చెల్లింపులలో జాప్యం జరడంలేదని, ఈస్థితిలో నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని సూచించారు. పీఎం జన్‌మన్ గృహ నిర్మాణ వ్యయం పీటీజీలకు రూ. లక్ష, గిరిజనులకు రూ.75 వేలు చొప్పున ప్రభుత్వం అదనంగా పెంచిందన్నారు. ఈ పెంచిన నగదు నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు వీలుగా ఉన్న వారికి అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ గోవిందు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: పీఎం జన్‌మన్ పక్కా గృహాల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని హౌసింగ్‌శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి. బాబు నాయక్ అన్నారు. గురువారం మండలంలోని కొమ్మంగి పంచాయతీ పరిధిలో నిర్మాణంలోనున్న గృహాలను పరిశీలించారు. ఈసందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ బిల్లులకు నిధుల కొరతలేదన్నారు. బేస్‌మెంట్ స్థాయి రూ.70వేలు, రూఫ్ స్థాయికి రూ. 90వేలు, స్లాబ్ స్థాయిలో రూ.40 వేలు లబ్ధిదారుని బ్యాంక్ ఖాతాకు జమచేస్తామన్నారు. గృహ నిర్మాణాలు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, హౌసిగ్ ఏఈలు కె. రమణబాబు, వర్కుఇన్‌స్పెక్టర్ ఎస్.రాజారావు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలను నియమించాలి: సీపీఎం

అరకులోయ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అరకులోయ మండల పరిధి ఉన్న గన్నెల, సుంకరమెట్ట, మాడగడ పీహెచ్‌సీల పరిధిలో ఆశ కార్యకర్తలుగా పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన వారి స్థానాల్లో కార్యకర్తలను నియమించాలని సీపీఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన్‌వభన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు అధికారులకు తక్షణ సమాచారంతో పాటు ప్రాథమిక వైద్యం అందించడంలో ఆశ కార్యకర్త ఎంతో కీలకంగా పనిచేస్తారన్నారు. అటువంటి ఆశ కార్యకర్తలు లేని చోట గ్రామాల నుంచి సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొంటోందన్నారు. ఈస్థితిలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ పీహెచ్‌సీల పరిధిలో ఖాళీగా ఉన్న చోట్ల ఆశ కార్యకర్తలను తక్షణం నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు చినబాబు, మగ్గన్న, కిల్లో జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

కన్నెలకట్టు గ్రామానికి రోడ్డు, పాఠశాల మంజూరు చేయాలి


గెడ్డలో దిగి నిరసన తెలుపుతున్న విద్యార్థులు, జీఎస్‌యూ నేతలు

పెదబయలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంతుర్ల పంచాయితీ పరిధిలో శివారు గ్రామమైన కన్నెలకట్టు గ్రామంలో తక్షణం పాఠశాల మంజూరు చేయాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు కిషోర్, బాజూజీ, మాధవరావు డిమాండ్ చేశారు. సుమారు 30 మంది విద్యార్థులు గ్రామంలో పాఠశాల లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలోని కిముడుపల్లి పంచాయితీ మచుపల్లి ప్రాథమిక పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తున్నారు. మధ్యలో గెడ్డ దాటాల్సి వస్తోంది. ఈ విషయం తెలుసుకున్న గిరిజన సంఘ నేతలు గురువారం గ్రామానికి వెళ్లి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పక్కా రోడ్డు లేక రవాణాకు అవస్థలు పడుతున్నామని వారు వివరించారు. అనారోగ్య పరిస్థితుల్లో డోలీ ద్వారా రోగులను ఆస్పత్రికి తరలిస్తున్నట్టు వివరించారు. అలాగే గ్రామంలో పాఠశాల లేకపోవడంతో చిన్నారులు ప్రాణాలకు తెగించి పక్కా గ్రామానికి వెళ్లి చదువుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేవరు. సమస్యలపై పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. అనంతరం వారంతా గ్రామ సమీపంలోని గెడ్డలో దిగి నిరసన వ్యక్తం చేశారు. కన్నెలకట్టు గ్రామనికి రోడ్డు, పాఠశాల నిర్మించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మాధవరావు, మత్స్యరాజు, సత్యవతి, మోహన్‌రావు, గోపాల్, సుబ్బారావువిద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆస్పత్రిలో మెరుగైన సేవలందించాలి

▸▸ సిబ్బందికి అభివృద్ధి కమిటీ సభ్యురాలు పద్మావతి సూచన



ఆస్పత్రిలో సేవలను గర్భిణుల ద్వారా తెలుసుకుంటున్న పద్మావతి

నర్సీపట్నం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలందాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు, 26వ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. గురువారం ఆస్పత్రిని సందర్శించి పలు విభాగాలను తనిఖీ చేశారు. అత్యవసర విభాగం, జనరల్ వార్డు, డయాలసిస్ యూనిట్, ప్రసూతి విభాగాలను పరిశీలించి అక్కడి రోగుల ద్వారా వైద్య సేవలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల పారిశుధ్యం, సెక్యూరిటీ విభాగాలపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. మరోసారి ఇటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఫైలేరియా వ్యాక్సిన్ లక్ష్యాన్ని చేరుకోవాలి

▸▸ పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాంబాబు



డాక్టర్ రమేశ్‌ను సత్కరిస్తున్న ఏడీ రాంబాబు, తదితరులు

నర్సీపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఫైలేరియా వ్యాక్సిన్ లక్ష్యాన్ని నెలాఖరులోగా చేరుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీ డబ్ల్యూ రాంబాబు సూచించారు. నర్సీపట్నం పశువుల ప్రాంతీయ ఆస్పత్రిలో గురువారం పశు వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి సోకిన సంకరజాతి పశువులు అత్యధికంగా మరణిస్తున్నాయన్నారు. ప్రభుత్వం పూర్తి రాయితీలో ఫైలేరియా వ్యాక్సిన్ అందుబాటులో ఉంచిందన్నారు. ఇప్పటి వరకూ 40 శాతం మాత్రమే పూర్తయ్యిందని, నెలాఖరులోగా నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని పేర్కొన్నారు. అనంతరం సబ్ డివిజన్ నుంచి బదిలీపై వెళుతున్న పశు వైద్యాధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు లోకుల రమేశ్, కె.పుష్ప, పి.నరేశ్, జె.దుర్గాప్రసాద్, జీవీఎం శిరీషా తదితరులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్‌డీగా బాబూరావు బాధ్యతలు

గొలుగొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఈవోపీఆర్‌డీ దేవుళ్ళ బాబూరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో మేరీరోజీ. తదితర సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

పీఏసీఎస్‌ల ద్వారా నేరుగా రైతులకు రుణాలు

▸▸ నూతన పాలకవర్గానికి స్పీకర్ అయ్యన్న సూచన ▸▸ నాతవరం మండలంలో మూడు సహకార సంఘాల చైర్‌పర్సన్లు ప్రమాణ స్వీకారం

నర్సీపట్నం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : పీఏసీఎస్‌ల ద్వారా నేరుగా రైతులకు ప్రయోజనాలు చేకూర్చాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. నర్సీపట్నం పీఏసీఎస్ చైర్‌పర్సన్ రుత్తల కృష్ణ స్పీకర్‌ను గురువారం ఇక్కడ మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత ఉండాలన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులకు రుణాలు ఇవ్వాలన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పీఏసీఎస్‌లు మూలస్తంభాలుగా పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పీఏసీఎస్ పాలకవర్గానికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, రావాడ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్, టీడీపీ నాయకులు

నాతవరం మండలంలో కోలాహలం

నాతవరం : మండలంలోని మూడు పీఏసీఎస్‌ల నూతన చైర్‌పర్సన్లు గురువారం కార్యకర్తల కోలాహలం నడుమ ప్రమాణ స్వీకారం చేశారు. దశాబ్దమున్నర కాలం తరువాత నాతవరం, గన్నవరం, పీకే గూడెం పీఏసీఎస్‌ల చైర్‌పర్సన్లుగా టీడీపీకి చెందిన నాయకులు ఎన్నిక కావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందానికి అవధులు లేవు. బాణసంచా కాల్చుతూ భారీ ర్యాలీగా కో- ఆపరేటివ్ బ్యాంకులకు తీసుకువెళ్లారు. మండల కేంద్రం నాతవరం పీఏసీఎస్ నూతన చైర్‌పర్సన్‌గా అపిరెడ్డి మాణిక్యం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన నాతవరం ఎంపీటీసీగా చేశారు. అలాగే గన్నవరం పీఏసీఎస్ నూతన చైర్‌పర్సన్‌గా సింగంపల్లి సన్యాసి దేముడు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన నాతవరం ఎంపీపీగా పనిచేశారు. అలాగే పీకేగూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా అంకంరెడ్డి నానిబాబు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా నాతవరంలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ నూతన చైర్‌పర్సన్లు పార్టీలకు అతీతంగా రైతులందరికీ రుణాలు ఇచ్చి కో- ఆపరేటివ్ బ్యాంకులకు పూర్వవైభవం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఎన్.విజయ్‌కుమార్, శెట్టి నాగేశ్వరరావు, డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాతవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా ప్రమాణం చేసిన అపిరెడ్డి మాణిక్యం అభినందన కార్యక్రమంలో టీడీపీ నేతలు

తాగునీటి సమస్యపై జోగంపేటలో ఆందోళన

▸▸ పదిరోజులుగా ఇబ్బందులు పడుతున్నామని మహిళల ఆవేదన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

గొలుగొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోగంపేటలో పదిరోజులుగా తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్థులు వాపోయారు. ఈ మేరకు ఖాళీ బిందెలతో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ నిరంతరం కుళాయిలు వేసినప్పటికీ తాగునీరు అందకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. తాగునీటి పైపులైన్ వాల్వులు మరమ్మతులకు గురవడంతో ఈ సమస్య ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాల్సిందిగా వారు కోరారు. ఈ సమస్యను ఎంపీడీవో మేరీరోజీ వద్ద ప్రస్తావించగా, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం'



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ ధీరజ్

కృష్ణాదేవిపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు ప్రజలు ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించడంతో పాటు పార్శిల్, ఇతర సేవలను సద్వినియోగం చేసుకోవాలని నర్సీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ ధీరజ్ కోరారు. ఏఎల్‌పురంలోని రామాలయం వద్ద సంస్థ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ముందుగా ప్రజలు అదనపు బస్సులు సర్వీసులను పెంచాలని, స్థానిక బస్‌స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం డీఎం మాట్లాడుతూ ప్రయాణికులకు అన్ని సేవలందించేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. తమ వాహనాల్లో ప్రయాణం వలన రాయితీతో పాటు సురక్షిత ప్రయాణం అందించడం జరుగుతుందన్నారు. ఇదిలావుంటే, ఇక్కడి ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణంలో రూ.6.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను డీఎం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ ఎం.మోహన్‌రావు, సంస్థ ఏఈలు వి.వి.రావు, పీవీఎస్ నారాయణ, సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీ చింతల బుల్లిప్రసాద్, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, చిటికెల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్టు స్థానిక ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నందున కొరువాడ, ఆర్‌వై అగ్రహారం, పిండ్రంగి, గవరపాలెం, కేజే పురం, పోతనవలస, ఉగ్గినవలస, రొంగలినాయుడుపాలెం, మేడిచర్ల, పైడంపేట, మురుగుపాలెం, పాచిలవానిపాలెం, బత్తివారి కళ్లాల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాడుగులలో..

మాడుగుల: గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ రాంబాబు తెలిపారు. కింతలి సబ్ స్టేషన్ పరిధిలో కింతలి, కింతలి వల్లాపురం, అవురివాడ, ఎం.కోడూరు, సాగరం, సాగరం, శంకరం, తాటిపర్తి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పంపిణీకి షూస్ సిద్ధం

రావికమతం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని 3,137 మంది విద్యార్థులకు ప్రభుత్వం షూస్ మంజూరు చేసింది. ఈ మేరకు మండల విద్య శాఖ కార్యాలయం నుంచి ఆయా పాఠశాలలకు ఈ షూస్‌ను సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు యూనిఫాం దుస్తులు, పాఠ్యపుస్తకాలు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల ద్వారా బ్యాగులు, బెల్టులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా షూస్‌ను సిద్ధం చేస్తున్నారు. మండలంలో 9 యూపీ స్కూల్, 11హైస్కూల్, 53 ప్రైమరీ స్కూల్స్‌లోని చిన్నారులకు అందజేయనున్నారు.

దేవరాపల్లి ఎస్‌ఐకు ఆకస్మిక బదిలీ

దేవరాపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావును ఆకస్మిక బదిలీ చేస్తూ ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది కిందటే బదిలీపై వచ్చిన మల్లేశ్వరరావును అర్ధాంతరంగా బదిలీ చేయడానికి గల కారణాలు తెలియరాలేదు. అయితే ఇటీవల ఎస్పీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విషయం తెలిసిందే, ఈ క్రమంలో మల్లేశ్వరావును వీఆర్‌లో పెట్టినట్లు తెలిసింది. ఆయన స్థానంలో పరవాడ ఎస్.ఐ.సత్యనారాయణను నియమించారు. శుక్రవారం విధుల్లో చేరే అవకాశం ఉంది.

వర్షంతో ఉపశమనం



కె. కోటపాడులో ప్రధాన రహదారి పై నిలిచిన వర్షపునీరు

కె. కోటపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో ఇబ్బంది తలెత్తింది. మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని సుమారు గంటపాటు వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు అల్లాడిపోయారు. దీంతో గురువారం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడి వృద్ధులు, చిన్నపిల్లలు ఉపశమనం పొందారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కోటపాడు ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది. పలు రోడ్లు చిత్తడిగా మారాయి. పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం ఖరీఫ్ సీజన్‌కు ఉపయోగమని రైతులు తెలిపారు.


జిల్లా జడ్జికి సత్కారం



జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజును సత్కరిస్తున్న న్యాయవాదులు

చోడవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజును ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ కొత్త కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చిన్నంశెట్టి రాజు, చోడవరంలో జడ్జిగా పనిచేశా రు. ఈ సమయంలో బార్ అసోసియేషన్‌కు అందించిన సహాయ సహకారాన్ని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో 9వ అదనపు జిల్లా జడ్జి కె.నరేశ్, సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకర్, చోడవరం, మాడుగుల, పాడేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిలు బి. సూర్యకళ, లావణ్య, రాములు, స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ ఎస్ రాజు బార్ అసోసియేషన్ సభ్యునిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కామిరెడ్డి వెంకటరావు,చీపురుపల్లి సూర్యనారాయణ,న్యాయవాదులున్నారు.

రైతులకు సేవ చేయండి: ఎమ్మెల్యే



సహకార సంఘం అధ్యక్షులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ఉన్న రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించాలని త్రిసభ్య పాలక వర్గ సభ్యులను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండలంలోని ఎం.అలమండ, ములకలాపల్లి సహకార సంఘాల పాలక వర్గ సభ్యులతో గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. ములకలాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా చామంతుల సన్యాసిరావు, డైరెక్టర్‌గా రొంగలి గవిందరావు, బోకం సోమేశ్వరరావులు, ఎం.అలమండ పీఏసీఎస్ చైర్మన్‌గా గొర్లి గోవింద, డైరెక్టర్లుగా యాళ్ల అప్పలనాయుడు, బొడ్డు వెంకటరావులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, సోమిరెడ్డి గోవింద, దొగ్గనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రావికమతం మండల అధ్యక్షుడిగా శంకరరావు

రావికమతం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడిగా చినపాచిల ఉప సర్పంచ్ కోమటి శంకరరావు ఎన్నికయ్యారు. గురువారం స్థానికంగా పార్టీ పరిశీలకుడు చిటిమరెడ్డి సూర్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో నాయకులంతా శంకరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 8న మండల పార్టీ అధ్యక్షురాలిగా జడ్పీటీసీ మాజీ సభ్యురాలు రాజాన శ్రీవాణిని ఎన్నుకున్నారు. అయితే, ఈమె భర్త రాజాన కొండనాయుడు ప్రస్తుతం మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. దీంతో కొండనాయుడు స్థానంలో ఆయన భార్య శ్రీవాణి ఎన్నికపై అభ్యంతరాలువ్యక్తమయ్యాయి. ఈ స్థితిలో పార్టీలో చురుగ్గా ఉంటున్న కోమటి శంకరరావుని మండల పార్టీ అధ్యక్షుడి పార్టీఅబ్జర్వర్ సూర్యనారాయణ ఈ సమావేశం నిర్వహించి అందరి సమక్షంలో ప్రకటించారు. శంకరరావును ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు కొండనాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు,కార్యకర్తలు అభినందించారు.



శంకరరావును అభినందిస్తున్న అబ్జర్వర్ సూర్యనారాయణ, నాయకులు

సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ: ఎమ్మెల్యే బండారు

మాడుగుల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపుతోందని మాడుగుల శాసన సభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం మండలంలో వీరనారాయణం గ్రామంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే బండారు పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను గ్రామస్థులకు అందించారు. అనంతరం ప్రభుత్వ పనితీరు ఏ విధంగా ఉంది, సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలకు ప్రశ్నించారు. ఏ సమస్యలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా అన్ని పథకాలు అందుతున్నాయని మహిళలు ఎమ్మెల్యేకు తెలిపారు. ముందు గ్రామంలోని పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా నియమితులైన పతివాడ వరహాలనాయుడు, డైరెక్టర్ దాడి కనక అప్పారావు, రాకోటి చిన్నోడు ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో బండారు పాల్గొన్నారు ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, నేతలు అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, నందారపు సన్యాసిరావు, పీఏసీఎస్ సీఈవో సత్యనారాయణ, నాయకులు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

బుచ్చెయ్యపేట: మండలంలోని మల్లాం, భూపతిపాలెం, భీమవరం, చిన భీమవరం, అప్పంపాలెం, రాజాం, లైపురం, చిట్టియ్యపాలెం, తురకలపూడి, కరక, సీతయ్యపేట, చింతపాక,పెదమదిన, బుచ్చెయ్యపేట గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సీతయ్యపేట సర్పంచ్ వజ్రపు ఇందిరాశ్రీను, సుంకరిలక్ష్మి, తమరాన దాసు, దొండా సన్యాసిరావు, గోకివాడ కోటేశ్వరరావు, శిరిగిరిశెట్టి శ్రీరామ మూర్తి, గొలగాని రాజారావు, డొంకిన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వీరనారాయణలో కరపత్రాలందిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ఘనంగా మరిడిమాంబ పండగ

బుచ్చెయ్యపేట జూలై 17 ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాదిలో గురువారం మరిడిమాంబ పండుగ ఘనంగా నిర్వహించారు, అమ్మవారిని విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, తమరాన దాసు, వర్తక సంఘం సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నేల వేషాలు, బాణసంచా తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు.

'అమలు కాని హామీలు'



మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు

దేవరాపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడం అన్యాయమని మాజీ ఉపముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు విమర్శించారు. గురువారం తారువలో మండల వైసీపీ విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు బూరెబాబూరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కర్రిసత్యం, పంచాడ సింహాచలంనాయుడు, కేవీ రమణ, చింతల వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

బుచ్చెయ్యపేట జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆర్.శివరాంపురానికి చెందిన రోడ్డు ప్రమాద బాధితుడు దేవర చిలుకు నాయుడు కుటుంబానికి యాదవ సంఘం అధ్యక్షులు భరిణికాన సాయినాథ్, మెల్లి ప్రసాద్, సింగంపల్లి రమేశ్, గోకివాడ కోటేశ్వరరావు 25 వేలు సా యంగా అందించారు. చిలుకునాయుడు భార్యతో కుమార్తెతోట వెళ్తుండగా విశాఖలో రోడ ప్రమాదానికి లోనయ్యారు. భార్య మృతి చెందారు. దీంతో తల్లిని కోల్పోయిన పిల్లల చదువుకు యాదవ సంఘ నాయకులకు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నేతలుసబ్బి శ్రీను, కరక సోమునాయుడు, వియ్యపు అప్పారావు,గొలగాన రాజారావు, బొట్టాత్రివేణి పాల్గొన్నారు.

'కోనాం' గేట్లు పనులు త్వరలో ప్రారంభం: డీఈఈ



కోనాం జలాశయాన్ని పరిశీలిస్తున్న డీఈఈ వేణుగోపాలనాయుడు

చీడికాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కోనాం జలాశయం గేట్లు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్టు నీటి పారు దలశాఖ డీ ఈఈ చింతల వేణు గోపాల నాయుడు తెలిపారు. కోనాం పాలవెల్లి జలాశయాన్ని గురువారం ఆ శాఖ ఏఈఈ బండారు సత్యనారాయణదొరతో కలిసి పరిశీలించారు. ముందుగా గేట్లు ద్వారా లీకవుతున్న సాగునీటిని గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గేట్లు నిర్మాణానికి ఇప్పటికే రూ. కోటి నిధులు మంజూరయ్యాయని,వీటితో నిర్మాణ పనులు పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల కోరికమేరకు ఈ నెలాఖరులోకానీ, వచ్చేనెల మొదటి వారం లోగాని జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వెంకటరాజపురం మాజీ సర్పంచ్ దాలిబాబు మృతి



దాలిబాబు

దేవరాపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరాజపురానికి చెందిన మాజీ సర్పంచ్ లెక్కల దాలిబాబు (68) గురువారం ఉదయం మృతి చెందారు. తెలుగు దేశం పార్టీకి చెందిన దాలిబాబు రెండుసార్లు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీడీపీలో కీలక పాత్ర పోషించారు. పలువురు టీడీపీ నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. దాలిబాబు మృతి పార్టీకి తీరని లోటన్నారు.

మంత్రి నిమ్మల, అనకాపల్లి ఎంపీ పర్యటన రేపు

చోడవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, అనకాపల్లి సీఎం రమేశ్ ఈనెల 19 శనివారం మండలంలో పర్యటించనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు గురువారం తెలిపారు. స్థానిక శివాలయం వీధిలో నిర్వహించే సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారని, అనంతరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మెగా జాబ్‌మేళాలో పాల్గొంటారని, ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో ఎంపీ విజయేంద్ర ప్రసాద్ నిధులతో నిర్మించిన డైనింగ్ హాలును ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ పర్యటనను కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

తురువోలులో ఘనంగా పశువుల పండగ



ఆలయానికి ఊరేగింపుగా వెళుతున్న గ్రామ పెద్దలు, భక్తులు

చీడికాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో తురువోలు గ్రామంలో గురువారం పశువులపండగ ఘనంగా నిర్వహించారు. ఏటా రైతులు వరినాట్లు వేసేముందు ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మహిళలు పసుపు, కుంకుమలతో ఊరేగింపుగా వెళ్లి పండగ నిర్వహించారు. సర్పంచ్ మట్టా అప్పారావు, ఉప సర్పంచ్ పీటీ బాబు, ఎంపీటీసీ సభ్యుడు బీళ్ల కోటేశ్వరరావు, టీడీపీ నా యకులు రెడ్డి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జోష్ మిషన్ సేవలు అభినందనీయం



పాదచారుల విశ్రాంతి షెడ్‌ను ప్రారంభిస్తున్న సీఐ

రావికమతం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఫాదర్ కె.వర్గీష్ సారథ్యంలో జోష్‌మిషన్ సంస్థ ఈ ప్రాంతంలో చేస్తున్న సేవలు అభినందనీయమని కొత్తకోట సీఐ జి.కోటేశ్వరావు కొనియాడారు. ఈ సంస్థ ఆర్థిక సాయంతో కొత్తకోట- ధర్మవరం వెళ్లే రహదారిలో రూ. లక్షతో పాదచారులకు విశ్రాంతి షెడ్ నిర్మించారు. దీనిని సీఐ, టీడీపీ తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కోట నీలవేణి, టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు తదితరులు గురువారం ప్రారంభించారు.కార్యక్రమంలో ఫాదర్ కె.వర్గీష్, కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్‌రావు,జోష్‌మిషన్ ప్రతినిధులున్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చెయ్యపేట జూలై 17 (ఆంధ్రజ్యోతి): వడ్డాదిలో గురువారం వీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె జబ్బు కలిగిన వారిని, కంటి ఆ పరేషన్ల కోసం ఎంపిక చేసి ఆస్పత్రికి తరలించారు. నిర్వాహకులు వడ్డి సత్యారావు తోపాటు, వైనాయుడు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

చోడవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 19 మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్. గోవిందరావు తెలిపారు. ఈమేళాలో పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ పీజీ చదివిని 18నుంచి 35 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతీయువకులు పాల్గొని ఉపాధి అవకాశాలు పొందవచ్చని సూచించారు. విద్యార్హత సర్టిఫికెట్లతో శనివారం ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్: 94947 91935 సంప్రదించాలని గోవిందరావు విజ్ఞప్తి చేశారు.

మండల సమావేశం రేపు

చీడికాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం ఈనెల 19న జరుగుతుందని ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

బోధనలో త్రీడీ

ఏయూ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల వినూత్న ఆవిష్కరణ


స్కాన్ చేస్తే పూర్తి వివరాలు తెలిపేలా..

గుండె గురించి వివరిస్తున్న యాప్

- ఆగ్యుమెంటెడ్ రియాలిటీ బేస్డ్ ఎడ్యుకేషన్‌కు ఉపయోగపడేలా కోడింగ్ చేసిన విద్యార్థులు
- ఈ యాప్‌లో ఫొటోలను స్కాన్ చేయడం ద్వారా త్రీడీ విధానంలో చూసే వెసులుబాటు
- టచ్ చేయడం ద్వారా చిత్రంలోని ప్రతి అంశాన్ని స్పష్టంగా తెలుసుకునే అవకాశం
- సైన్స్, ఇతర సబ్జెక్టుల బోధనలో విద్యార్థులకు మేలు చేకూర్చేలా డిజైన్
- స్కాన్ చేసే ఫొటోకు సంబంధించిన అంశాలను కోడింగ్ చేసిన విద్యార్థులు
- కోడింగ్ విధానంతో త్రీడీ విధానంలో ఫొటోలు, వీడియోలు డిస్‌ప్లే

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

ఆంధ్రా యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల పరిధిలోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణ చేశారు. పాఠశాల విద్యార్థుల బోధనలో సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టేలా ఆధునిక సాంకేతికతను డిజైన్ చేశారు. పుస్తకంలోని బొమ్మను యాప్‌లో స్కాన్ చేయడం ద్వారా త్రీడీ విధానంలో ఆయా చిత్రాన్ని చూసేలా సరికొత్త సాంకేతికతను కోడింగ్ చేశారు. దీనివల్ల విద్యార్థులు సైన్స్, ఇతర పాఠ్యాంశాలను మరింత అర్థవంతంగా నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందని ఇంజనీరింగ్ విద్యార్థులు చెబుతున్నారు.

యాప్‌లో స్కాన్ చేసే చిత్రం త్రీడీలో ఫోన్, ఇతర స్క్రీన్‌లపై డిస్‌ప్లే అవుతుంది. దానిని విద్యార్థులు టచ్ చేసి తమకు కావాల్సిన వైపు తిప్పి మరింత లోతుగా విశ్లేషించుకునేందుకు అవకాశం ఉంది. ఉదాహరణకు పేపర్‌పై హార్ట్ చిత్రాన్ని ఈ యాప్‌లో స్కాన్ చేస్తే త్రీడీలో హార్ట్ ఫొటో, వీడియో డిస్‌ప్లే అవుతుంది. దానిని విద్యార్థులు టచ్ చేయడం ద్వారా హార్ట్ పంక్షనింగ్, గుండెలోని ఇతర భాగాలు, వాటి పనితీరు వంటి అంశాలను తెలుసుకోవచ్చు. ఇందుకోసం నంబర్ విధానాన్ని కూడా విద్యార్థులు కోడ్ చేశారు. త్రీడీ నమూనాను క్లిక్ చేయగానే కనిపించే నంబర్లను టచ్ చేస్తే ఆయా అవయవాలకు సంబంధించిన మరిన్ని వివరాలు అందులో ఉంటాయి. ఇది ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సైన్స్, టెక్నాలజీకి సంబంధించిన పాఠాల బోధనకు ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులను గైడ్ చేసిన ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొణతాల అరవింద శిల్ప తెలిపారు.

పనిచేసే తీరు..

విద్యార్థులు డిజైన్ చేసిన ఈ ఆధునిక సాంకేతికత పూర్తిగా కోడింగ్‌పై ఆధారపడి ఉంది. ఇందుకోసం ఇప్పటికే అందుబాటులో ఉన్న రెండు యాప్‌లను వినియోగిస్తున్నారు. ఈ యాప్‌లో ముందుగానే విద్యార్థుల పాఠాల బోధనకు అవసరమైన చిత్రాలకు సంబంధించిన అంశాలను కోడింగ్ చేస్తారు. ఉదాహరణకు గుండెకు సంబంధించిన అంశాలను త్రీడీ విధానంలో ఫొటో, వీడియో రూపంలో చూడాలనుకుంటే అందుకనుగుణంగా గుండె పనితీరు, గుండెలోని భాగాలు, రక్త ప్రసరణ, ఇతర అంశాలను కోడింగ్ ద్వారా యాప్‌కు డేటా అందిస్తారు. ఈ సమాచారాన్ని క్రోడీకరించుకున్న తరువాత యాప్‌లో పుస్తకంలో గుండె ఫొటోను స్కాన్ చేయడం ద్వారా మొత్తం సమాచారాన్ని త్రీడీ విధానంలో చూసుకునే వెసులుబాటు కలుగుతుంది. ప్రస్తుతం యాప్‌లో గుండె, బ్లడ్ సర్క్యులేటివ్ సిస్టమ్‌కు సంబంధించిన అంశాలను మాత్రమే కోడింగ్ చేశారు. దీని పేటెంట్ కోసం ఇప్పటికే విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పేటెంట్ రైట్స్ వచ్చిన తరువాత మార్కెట్‌లోకి తీసుకురావాలన్న యోచనలో వారున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు లోతైన సమాచారాన్ని, స్వీయ అనుభూతిని పొందేందుకు తద్వారా ప్రతి అంశాన్ని గుర్తు పెట్టుకునేందుకు ఇది ఉపకరిస్తుందని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు చెబుతున్నారు. పాఠశాలలు తమ అవసరాలకు అనుగుణంగా దీనిని వినియోగించుకోవచ్చని, అందుకనుగుణంగా తాము కోడింగ్ చేసి అందిస్తామని వారు పేర్కొంటున్నారు.


ప్రిన్సిపాల్ పద్మశ్రీ, గైడ్ అరవింద శిల్పతో యాప్‌ను రూపకల్పన చేసిన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు


త్రీడీ విధానం గురించి తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరవింద శిల్ప

ఇదీ బృందం..

ఈ ఆధునిక సాంకేతికతను ఆగ్యుమెంటెడ్ రియాలటీ బేస్డ్ ఎడ్యుకేషన్ విజువలైజేషన్ కోసం డిజైన్ చేశారు. ఇందుకోసం యూనిటీ, వూఫ్రా అనే రెండు యాప్‌లను వినియోగిస్తున్నారు. త్రీడీ ఎఫెక్ట్‌తో చిత్రాలు, వీడియోలు చూసేందుకు అనుగుణంగా కోడింగ్ చేస్తున్నారు. ఈ టెక్నాలజీని ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ విభాగం ఫైనలియర్ పూర్తి చేసిన ఎస్.ఝాన్సీ, బి.లోకేశ్వరి, ఆర్.యక్షిత డిజైన్ చేయగా... ఈ బృందానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొణతాల అరవింద శిల్ప గైడ్‌గా వ్యవహరించారు. ఈ టెక్నాలజీని ఆవిష్కరించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.పద్మశ్రీ, విభాగాధిపతి ఆర్.శ్రీను నాయక్ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ విభాగాధిపతి, ప్రిన్సిపాల్, గైడ్‌ల సహకారంతో ఈ ఆవిష్కరణ చేశామన్నారు. దీనిని మార్కెట్‌లోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. పేటెంట్ వచ్చిన తరువాత మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. 45 రోజుల్లోనే ఈ సాంకేతికతను అభివృద్ధి చేసినట్టు విద్యార్థులు వెల్లడించారు. అన్నింటి కంటే ముఖ్యంగా ఈ యాప్‌లు ఇంటర్నెంట్ అవసరం లేకుండా పని చేస్తాయని, కాబట్టి ఎక్కడ ఉన్నా సులభంగా వినియోగించు కోవచ్చన్నారు. యూట్యూబ్‌లో పాఠాలు వినడం ద్వారా కొంతవరకు మాత్రమే నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందని, ఈ విధానంలో విద్యార్థులు ప్రతి అంశాన్ని టచ్ చేసి మరింత లోతుగా విశ్లేషించి, తమకు కావాల్సిన వైపు తిప్పుకుని విశ్లేషించుకునే అవకాశాన్ని కల్పించడం వల్ల మరింత అర్థం చేసుకుంటారని వారు పేర్కొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

లంకెలపాలెం కూడలిలో క్రిస్ క్రాస్ డ్రమ్ములు, స్టాపర్లు ఏర్పాటు

లంకెలపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో లంకెలపాలెం కూడలి వద్ద ప్రమాదాలు జరగకుండా పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టారు. కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో పలువురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 'మూడు రోజుల ముచ్చటే.. లంకెలపాలెం కూడలిలో ప్రమాదాల నివారణకు చర్యలు శూన్యం' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి పోలీస్ అధికారులు స్పందించారు. కూడలికి 400 మీటర్ల ముందు రెండు వైపులా క్రిస్ క్రాస్ డ్రమ్ములు, స్టాపర్లను బుధవారం రాత్రి ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో జాగ్రత్తలు సూచించే ఎల్లో బ్లింకన్ లైట్‌తో పాటు కూడలి దాటిన తరువాత వేగ నియంత్రణ కోసం ప్రత్యేక ఏర్పాట్లుకు కృషి చేస్తున్నామని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. ట్రాఫిక్ పర్యవేక్షణ కోసం రెండు షిఫ్ట్‌ల్లో పోలీస్ సిబ్బందిని నియమిస్తున్నట్టు వెల్లడించారు.



లంకెలపాలెం కూడలిలో ప్రమాదాల నియంత్రణకు పోలీసులు ఏర్పాటు చేసిన క్రిస్ క్రాస్ డ్రమ్ములు, స్టాపర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పోస్టాఫీస్‌లో నిధులు గోల్‌మాల్

... 5వ పేజీ తరువాయి

పనిచేసిన నాగేశ్వరరావు.. పలువురు ఖాతాదారులు చెల్లించిన ఆర్‌డీలు, పొదుపు ఖాతాల సొమ్మును స్వాహా చేసినట్టు పోస్టల్ అధికారులు గుర్తించారు. ఈ విషయం వారం రోజుల క్రితమే బయటపడగా, బీపీఎం నాగేశ్వరరావు నుంచి సొమ్ము రాబట్టేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇందులో భాగంగా రెండు రోజులపాటు పోస్టాఫీసును మూసివేశారు. అయితే అతను విధులకు హాజరుకాకపోవడంతో సొమ్ము రికవరీ సాధ్యం కాలేదని తెలిసింది. ఖాతాదారుల ఫిర్యాదు మేరకు తాత్కాలికంగా మరో బీపీఎంను నియమించారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్ సమగ్రంగా విచారణ జరిపి, రూ.8.32 లక్షలు గోల్‌మాల్ అయినట్టు గుర్తించారు. బీపీఎం నాగేశ్వరరావుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు

... 5వ పేజీ తరువాయి

సాధించింది. 50 వేల నుంచి మూడు లక్షల లోపు జనాభా వున్న పట్టణాల్లో నర్సీపట్నం జాతీయ స్థాయిలో 553వ ర్యాంకులో నిలిచింది. సామాజిక మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావడం వల్ల ఓడీఎఫ్ ప్లస్ సాధ్యమైందని మునిసిపల్ అధికారులు అంటున్నారు.

రైవాడ ఆయకట్టుకు 29 నుంచి నీరు విడుదల

దేవరాపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రైవాడ జలాశయం ఆయకట్టుకు ఈ నెల 29వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనున్నట్టు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పోతల పాత్రునాయుడు తెలిపారు. జలాశయం అతిథిగృహంలో గురువారం నీటి సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ నెల 29వ తేదీ నుంచి నీటిని విడుదల చేయాలని అధికారులను కోరారు. డీఈఈ సత్యంనాయుడు మాట్లాడుతూ, రిజర్వాయర్ గరిష్ఠస్థాయి నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 111.3 మీటర్ల మేర నీరు వుందని, రానున్న రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం వున్నందున ఖరీఫ్‌కు నీటి కొరత వుండదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సమావేశంలో చోడవరం సబ్‌డివిజన్ డీఈఈ వేణుగోపాలరావు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పోతల పాత్రునాయుడు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మహా నిరాశ

... 5వ పేజీ తరువాయి

అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దేశంలోని నగరాలు, పట్టణాల్లో పరిశుభ్రతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో పోటీ నిర్వహిస్తోంది. పోటీలో పాల్గొనే నగరాలు, పట్టణాల్లో పారిశుధ్యం మెరుగుపరచడం, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచడం, చెత్తను రోడ్లపై పడేయకుండా ఇంటి వద్దకు వచ్చే వాహనాలకు అందజేయడం, తడి-పొడి చెత్తను ఇంటి వద్దనే వేరుచేసి వాహనాలకు అందజేయడం, యార్డులకు చేరిన చెత్తను తిరిగి వినియోగించుకునేందుకు వీలుగా వివిధ రకాల వనరులను అందుబాటులోకి తెచ్చి సంపదగా మార్చడం వంటి వాటికి కేంద్ర ప్రభుత్వమే నిధులను మంజూరుచేసి స్థానిక సంస్థల ద్వారా పనులు చేయిస్తుంది. ఏడాది చివరిలో కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక బృందాలు వచ్చి నగరాల్లో పరిశుభ్రత, స్థానిక సంస్థల పనితీరు, ప్రజల భాగస్వామ్యం, పరిశుభ్రత గురించి ప్రజల్లో ఉన్న అవగాహన, ఇంటివద్దనే చెత్త విభజన, డోర్ టు డోర్ చెత్తసేకరణ, యార్డుల్లో చెత్త నిర్వహణ వంటి అంశాలను నేరుగా పరిశీలిస్తాయి. ఉత్తమ ఫలితాలు సాధించిన నగరాలకు అవార్డులు అందజేస్తుంది. 2016లో దేశవ్యాప్తంగా 73 నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో పాల్గొంటే జీవీఎంసీ ఐదో ర్యాంకు దక్కించుకుంది. 2017లో 434 నగరాలు పాల్గొంటే మూడో ర్యాంకు దక్కించుకుంది. 2018లో 4,203 నగరాలు పోటీ పడితే పది లక్షల పైబడి జనాభా కలిగిన నగరాల కేటగిరీలో జీవీఎంసీ ఏడో ర్యాంక్ దక్కించుకుంది. 2019లో 4,237 నగరాలు పోటీపడితే 23, 2020లో 4,242 నగరాలు పోటీపడగా 9, 2021లో 4,320 నగరాలు పోటీపడితే 9, 2022లో 4,354 నగరాలు పోటీపడితే 4, 2023లో 4,416 నగరాలు పోటీపడితే నాలుగో ర్యాంకు దక్కింది. అయితే 2024లో 4,589 నగరాలు పోటీపడగా జీవీఎంసీ తొమ్మిదో ర్యాంకుకు దిగజారిపోయింది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దిగజారడానికి అనేక కారణాలు

స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో మొత్తం 12,500 మార్కులకు పోటీ నిర్వహించారు. వీటిలో డోర్ టూ డోర్ చెత్త సేకరణ, విభజన, చెత్తను సంపదగా మార్చడం, పునర్వినియోగానికి వీలుగా చెత్తను మార్చే వనరులను అందుబాటులోకి తేవడం, క్షేత్రస్థాయిలో మార్కెట్లు, రోడ్లు, జనావాసాలు, ప్రజా మరుగుదొడ్లు, గెడ్డలను శుభ్రంగా ఉంచడానికి సంబంధించి పది వేల మార్కులు కేటాయించగా, యార్డులో చెత్త నిల్వలు లేకుండా చేయడం, బహిరంగ మలవిసర్జన నిర్మూలించడం, మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగానికి వాడడం వంటి విభాగాల్లో సాధించిన సర్టిఫికెట్‌లకు 2,500 మార్కులు కేటాయించారు.

అయితే జీవీఎంసీకి చెందిన కాపులుప్పాడలోని డంపింగ్ యార్డులో చెత్తకుప్పలను బయో మైనింగ్ ద్వారా పునర్వినియోగానికి వీలుగా తయారుచేయడం, అక్కడ భూమిని ఖాళీ చేసి పచ్చదనం పెంపు దిశగా పనులు జరుగుతున్నాయి. 2025 జనవరి నాటికి యార్డులో చెత్తలేకుండా చేయాల్సి ఉండగా, ఇంకా 20 శాతానికి పైగా అలాగే ఉండిపోవడంతో గార్బేజ్ ఫ్రీసిటీ (జీఎఫ్‌సీ)లో ఫైవ్ స్టార్ ర్యాంకు సర్టిఫికెట్ మాత్రమే కేంద్రం జారీచేసింది. సూపర్ స్వచ్ఛ లీగ్‌లో స్థానం దక్కించుకున్న విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలతోపాటు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీ కంటే మెరుగైన ర్యాంకులు సాధించిన నగరాలన్నీ జీఎఫ్‌సీలో సెవెన్ స్టార్ ర్యాంకులను దక్కించుకున్నాయి. దీనివల్ల జీవీఎంసీ 2,500 మార్కులకు గాను కేవలం 2,300 మార్కులు మాత్రమే దక్కించుకుంది. అలాగే డోర్ టూ డోర్ చెత్తసేకరణ నగరంలో 96 శాతం మాత్రమే జరుగుతుండడం, తడి పొడి చెత్తవిభజన 81 శాతం మాత్రమే జరగడం, జోన్ స్థాయిలో ఉన్న డంపింగ్ యార్డులో చెత్తను ఏరోజుకారోజు యార్డుకు తరలించే ప్రక్రియ 98 శాతం మాత్రమే జరగడం, ప్రజా మరుగుదొడ్ల పరిశుభ్రతలో 97 శాతానికే పరిమితం కావడం వంటి కారణాల వల్ల పది వేల మార్కులకు 9,336 మార్కులే వచ్చాయి. దీంతో మొత్తం 12,500 మార్కులకు 11,636 మార్కులను దాటలేకపోయింది. దీనివల్ల పదిలక్షల జనాభా కలిగిన నగరాల కేటగిరిలో జీవీఎంసీ తొమ్మిదో ర్యాంకుకు దిగజారిపోవాల్సి వచ్చింది.

క్రైం... crime news

లారీ ఢీకొని యువకుడి మృతి


రాజేశ్ హేమరామ్ మృతదేహం

ఎలమంచిలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడని రూరల్ ఎస్ఐ ఉపేంద్ర గురువారం తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాజేశ్ హేమరామ్(20) ఏటికొప్పాక సమీపంలో పోలవరం కాలువ పనులు చేపడుతున్న కేసీఎల్‌లో పనిచేసేందుకు మూడు నెలల క్రితం ఇక్కడికి వచ్చాడు. పనులు ముగించుకుని బుధవారం రాత్రి 10.45 గంటల సమయంలో కార్మికులు ఉండేందుకు కేటాయించిన షెడ్డు ముందు భాగంలో అతను కుర్చీలో కూర్చుని ఉండగా అదే సమయంలో కేసీఎల్ కంపెనీకి చెందిన లారీ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొంది. దీంతో రాజేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని ఎలమంచిలి సీహెచ్‌సీకి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అతనిని పశ్చిమ బెంగాల్ నుంచి తీసుకువచ్చిన తుషార్ బిశ్వాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలి మృతి

బుచ్చెయ్యపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకలపూడి గ్రామ శివారులోని పొలాల్లో కుళ్లిపోయిన స్థితిలో వున్న ఓ వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. గ్రామస్థులను విచారించగా.. మృతిచెందిన వృద్ధురాలు తురకలపూడి పంచాయతీ సర్పంచ్ యర్రంశెట్టి గోవింద్ మేనత్త వడ్డాది నూకమ్మ (70)గా గుర్తించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం చెల్లూరు గ్రామానికి చెందిన ఈమె గత ఏడాది రోడ్డు ప్రమాదానికి గురై మతిస్థిమితం కోల్పోయింది. సుమారు నెల రోజుల క్రితం మేనల్లుడు గోవింద్ ఇంటికి వచ్చి ఇక్కడే వుంటున్నది. గత శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే మతిస్థిమితం లేకపోవడంతో తిరిగి ఇంటికి వస్తుందన్న ఉద్దేశంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఈ నేపథ్యంలో తురకలపూడి శివారులోని పొలాల్లో కుళ్లిపోయిన స్థితిలో శవమై కనిపించింది. ఆమె మృతిపై తమకు ఎటువంటి అనుమానాలు లేవని సర్పంచ్ యర్రంశెట్టి గోవింద్ చెప్పారని, అయినప్పటికీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

'సఫాయిమిత్ర సురక్షిత్' కేటగిరీలో జీవీఎంసీ టాప్


కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) సఫాయిమిత్ర సురక్షిత్ షెహర్ కేటగిరీలో జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు దక్కించుకుంది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం జరిగిన జరిగిన కార్యక్రమంలో కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ చేతుల మీదుగా జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, ఏపీ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, కమిషనర్ కేతన్ గార్గ్ అవార్డును అందుకున్నారు. జీవీఎంసీలో డ్రైనేజీల్లో పూడికతీత, యూజీడీ బ్లాక్ అయినప్పుడు పనులను మనుషులతో (సఫాయి కార్మికులు) కాకుండా యంత్రాలతో చేయిస్తున్నారు. జెట్టింగ్ యంత్రాలు, రోబోలు వంటి వాటితో ప్రస్తుతం పూడిక తీస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం జీవీఎంసీకి సఫాయిమిత్ర సురక్షిత్ షెహర్ కేటగిరీలో మొదటి ర్యాంకు లభించింది. ఈ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ నగర ప్రజల సహకారం, జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు, అధికారులతోపాటు కార్పొరేటర్ల కృషి కారణంగానే జీవీఎంసీకి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో మరింత ఉత్తమ ప్రతిభ కనబరిచేందుకు కృషిచేస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీ కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకుని అధికారులు, ప్రజలను భాగస్వాములను చేస్తూ ముందుకువెళతామన్నారు. ఇదిలావుండగా స్వచ్ఛ సర్వేక్షణ్-2025 పోటీలో అవార్డు అందుకున్న వారిలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎస్‌వీ నరేష్‌కుమార్, చీఫ్ ఇంజనీర్ పల్లంరాజు ఉన్నారు.

స్వయం ఉపాధి అవకాశాలపై ఉచిత శిక్షణ

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ పథకం ద్వారా ఉచితంగా 20 రోజుల శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా పరిశ్రమల జీఎం పీకేపీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ త్రెర్డ్ ఐటీ సంస్థ ద్వారా నిర్వహిస్తామని, స్వయం ఉపాధి అవకాశాలు, ప్రాజెక్టు తయారీ విధానం, మార్కెట్ అవగాహన, ప్రభుత్వ పథకాలపై సమాచారంతో పాటు శిక్షణ ఇస్తారన్నారు. ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన సర్టిఫికెట్ లభిస్తుందన్నారు. శిక్షణలో పాల్గొనదలచిన వారు 18 నుంచి 58 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 9951447776 నంబరుకు సంప్రతించాలన్నారు.

భూమి కాలువకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

పాయకరావుపేట పోలీస్ స్టేషన్ వరకు పూడిక, తుప్పలు తొలగించారు. తరువాత వున్న దుర్గానగర్, ఎల్‌టీ కాలనీ, ఇందిరా కాలనీ, బృందావనం, గారావారి బీడు, ప్రశాంతినగర్, ధనిశెట్టినగర్, సాయినగర్ ప్రాంతాల్లో పలువురు కాలువ గట్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో కాలువలో ఎక్స్‌కవేటర్‌తో పూడిక, తుప్పలు తొలగించడానికి వీలుకాలేదు. దీంతో పాయకరావుపేట శివారు నుంచి నక్కపల్లి మండలం ఉద్దండపురం వరకు కాలువలో నిర్వహణ పనులు చేయలేదు. దీంతో సాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో గత ఏడాది సాధారణ ఎన్నికల సమయంలో గ్రామాల్లో ప్రచారానికి వెళ్లిన జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి దృష్టికి ఈ సమస్య వచ్చింది. దీంతో స్పందించిన ఆయన.. కూటమి అధికారంలోకి వస్తే భూమి ఆనకట్ట పంట కాలువను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా.. పంట కాలువ అభివృద్ధికి నిధులు విడుదల కాలేదు. రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు పాయకరావుపేట శివారు నుంచి నక్కపల్లి మండలం ఉద్దండపురం వరకు సుమారు 13 కిలోమీటర్ల మేర కాలువలో పూడిక, తుప్పలు తొలగించే పనులను గత నెల 14వ తేదీన ప్రారంభించారు. ఇందుకోసం సుమారు రూ.20 లక్షలు సొంత నిధులు ఖర్చు చేస్తున్నారు. ఉద్దండపురం వైపు నుంచి చేపట్టిన పనులు మరికొద్ది రోజుల్లో పూర్తికానున్నాయి. ఇప్పటికే తుప్పలు, పూడిక తొలగించిన చోట నీరు సాఫీగా ప్రవహిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా పాయకరావుపేట పట్టణ పరిధిలో సుమారు రెండు కిలోమీటర్ల మేర కాలువలో పూడిక, తుప్పలు, చెత్తను తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. దీనిపై జలవనరుల శాఖ డీఈఈ సురేశ్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. పట్టణ పరిధిలోని కాలువలో పూడిక, తుప్పలు తొలగించేందుకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందజేశామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు పంట కాలువను సర్వే చేసి ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	73.00
లైవ్ ధర	93.00
విత్ స్కిన్	156.00
స్కిన్ లెస్	166.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544